


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 84 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా మంగళవారం 7 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 84 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, TUE 7 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...
## మధురై కోర్టు సంచలన తీర్పు



- సాతంకుళం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు
- తొమ్మిది మంది పోలీసు అధికారులకు మరణ శిక్ష ఖరారు
- ఇది అత్యంత అరుదైన కేసు అని అభివర్ణించిన కోర్టు
- బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల పరిహారం చెల్లించాలని ఆదేశం
- 2020లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన ఇది

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని

మిగతా 2లో



## కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...
### అమెరికా, ఇజ్రాయెల్‌కు సవాల్!

- అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ కొత్త డ్రోన్
- 'హదీద్-110' పేరుతో స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్ తయారీ
- షాహెద్ కంటే మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణం
- గంటకు 510 కి.మీ వేగంతో 350 కి.మీ పరిధిలో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం
- మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధంలో కొత్త దశకు సంకేతం

మిగతా 2లో

## ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది



- యాడికిలో 'జలధార' 100 రోజుల యాక్షన్ ప్లాన్ విడుదల
- అమరావతే ఏకైక రాజధాని.. పిచ్చి ముదిరి మావిగన్ అంటున్నారన్న సీఎం
- పెట్టుబడులను అడ్డుకుంటున్నారని వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు
- జలధారతో ప్రతీ ఎకరాకు నీరు ఇస్తామని హామీ
- పూర్వోదయతో సీమకు మహర్దశ ఖాయమని ధీమా

పెన్ పవర్ డెస్క్:'పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే, అందులో 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికితే, ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజధాని ఏదంటే 'అమరావతి' అని గర్వంగా చెప్పుకునే రోజు వచ్చిందని, గత పాలకులు ఆడిన మూడు ముక్కలాట ముగిసిందని అన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో సోమవారం జరిగిన 'జలధార..

మిగతా 2లో





## ఏలూరు జిల్లాలో వర్షం, ఈదురుగాలుల బీభత్సం

- ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం
- గాలివానకు నేలరాలిన మామిడి, జీడి, అరటి, వరి పంటలు
- చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన
- మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక
- ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం, రైతులకు మాత్రం తీరని నష్టం

పెన్ పవర్ డెస్క్:ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గత మూడు రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించినా, రైతులకు మాత్రం కన్నీళ్లను మిగిల్చింది. చేతికి అందివచ్చిన పంటలు నేలపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి, బలమైన ఈదురు గాలులకు జనజీవనం స్తంభించింది.

మిగతా 2లో



## ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...
### ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

- అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడిలో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న దాడుల్లో పలువురు ఉన్నతాధికారుల మరణం
- దాడిని ధృవీకరించిన ఇరాన్ ప్రభుత్వం, ఐఆర్‌జీసీ
- ఈ ఘటనతో మరింత పెరగనున్న ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు

మిగతా 2లో

## మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్



- పవన్ కళ్యాణ్ చొరవతో అమృత్ భారత్ స్కీమ్‌లోకి పిఠాపురం రైల్వే స్టేషన్
- ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయి ప్రాముఖ్యతను వివరించిన పవన్
- యాత్రికుల సౌకర్యార్థం స్టేషన్‌లో అత్యాధునిక వసతుల కల్పన

మిగతా 2లో

## 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!
### శ్రీవారి అన్నదానంపై సీఎం చంద్రబాబు ఆసక్తికర పోస్టు



- తిరుమల నిత్యాన్నదాన పథకానికి 39 వసంతాలు పూర్తి
- 2 వేల మందితో మొదలై నేడు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం
- రూ.2,500 కోట్లు దాటిన శ్రీవారి అన్నప్రసాదం ట్రస్ట్ నిధులు
- దాతల సహకారం మరువలేనిదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీటీడీ పరిధిలోని 60 ఆలయాలకు పథకం విస్తరణ

మిగతా 2లో

## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

- కేరళలో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం
- సీఎం విజయన్ పై నిప్పులు చెరిగిన రాహుల్ గాంధీ
- ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని విమర్శ
- కేరళలో బీజేపీ, లెఫ్ట్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపణ
- మోదీని విమర్శిస్తే తనపై కేసులు, విజయన్‌పై ఎందుకు లేవని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విజయన్ ఏమీ దైవాంశ సంభూతుడు కాదని, ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని అన్నారు. త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన రాహుల్.. కేరళలో బీజేపీ, వామపక్షాల (ఎల్డీఎఫ్) మధ్య రహస్య అవగాహన ఉందని సంచలన ఆరోపణలు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీని

మిగతా 2లో

## జగన్ ప్రతిపాదన అవినీతిపై ఎక్కు పెట్టిన 'గన్'లా ఉంది



- జగన్ మావిగన్ కాన్సెప్ట్‌తో చంద్రబాబులో వణుకు మొదలైందన్న కన్నబాబు
- తక్కువ ఖర్చుతో అద్భుతమైన రాజధానిని నిర్మించవచ్చనేది జగన్ ఆలోచన అని కితాబు
- జగన్ ఆలోచన కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని ఎద్దేవా
- ఏబీఎన్ రాధాకృష్ణ జగన్‌పై విషయం చిమ్ముతున్నారని మండిపాటు

మిగతా 2లో

## అమరావతిపై నీ కుట్రలు ఇక సాగవు జగన్

- వైసీపీ ఒక రాజకీయ పార్టీ కాదు.. అదొక డ్రామా కంపెనీ అంటూ అనురాధ ఫైర్
- దోపిడీకి, అభివృద్ధికి మధ్య తేడా తెలుసుకోవాలని హితవు
- ప్రజలు తిరస్కరించినా వైసీపీ తీరు మారడం లేదని ఆగ్రహం
- లోకేశ్ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం జగన్‌కు లేదని విమర్శలు

మిగతా 2లో





## పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు
### ప్రధాని మోదీ, అసోం సీఎం హిమంత

- ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ తీరుకు ఇప్పటికే దేశం పలుమార్లు మూల్యం చెల్లించుకుంటోందన్న మోదీ
- జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### 2 వేల మందితో మొదలై.. 2.80 లక్షల మందికి..!

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన పథకం మరో మైలురాయిని అధిగమించింది. 1985 ఏప్రిల్ 6న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రారంభించిన ఈ మహోన్నత కార్యక్రమం నేటితో 39 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం కేవలం 2 వేల మంది భక్తులతో మొదలైన ఈ సేవ, నేడు రోజుకు 2.80 లక్షల మందికి అన్నప్రసాదం అందించే స్థాయికి చేరడం విశేషం. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల భాగస్వామ్యం, దాతల సహకారంతో శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ మూల నిధి రూ.2,500 కోట్లు దాటిందని తెలిపారు. ఈ పథకం స్ఫూర్తితోనే ప్రాణదానం, విద్యాదానం వంటి ట్రస్టులను ఏర్పాటు చేసి టీటీడీ ద్వారా వైద్య, విద్యా రంగాల్లో సేవలు అందిస్తున్నామని వివరించారు.
ప్రస్తుతం టీటీడీ పరిధిలోని మరో 60 దేవాలయాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాల్లోనూ నిత్యాన్నదానం పథకాన్ని అమలు చేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు జరిగిన ప్రగతిని వివరిస్తూ చంద్రబాబు సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను కూడా పంచుకున్నారు. ఈ మహోన్నత కార్యక్రమానికి చేయూతనిస్తున్న దాతలకు ఆయన అభినందనలు, నమస్కారాలు తెలియజేశారు.

### సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?

**- మొదటి పేజీ తరువాయి**

విమర్శించినందుకు తనపై కేంద్ర ఏజెన్సీలు చర్యలు తీసుకున్నాయని, కానీ సీఎం విజయన్‌ను గానీ, ఆయన కుటుంబాన్ని గానీ ఎందుకు ప్రశ్నించడం లేదని రాహుల్ నిలదీశారు. ఈ పరిణామం బీజేపీ, లెఫ్ట్ నేతల మధ్య ఉన్న రాజకీయ ఒప్పందాన్ని బలపరుస్తోందని పేర్కొన్నారు. కేరళ పర్యటనల్లో ప్రధాని మోదీ మతపరమైన అంశాలు మాట్లాడతారని, కానీ శబరిమల స్మగ్లింగ్ వ్యవహారంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. వామపక్షాలకు సహాయం చేసేందుకే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం విజయన్ ఫొటోలతో ఉన్న పోస్టర్లను ప్రస్తావిస్తూ, పాలన అంతా ఒక్కరే చేస్తున్నారనే అభిప్రాయాన్ని కల్పించడం రాజకీయ అహంకారమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ తరహా ఏకవ్యక్తి నాయకత్వం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మల పాలనలో కనిపిస్తుందని అన్నారు. కేరళలో పాలన సాగించేందుకు విజయన్ ఒక్కరే సమర్థుడని ప్రచారం చేసుకోవడం ప్రజలను అవమానించడమేనని రాహుల్ అన్నారు. వినయం, ప్రజల సానుభూతి ఉన్న ఎందరో నాయకులు రాష్ట్రంలో ఉన్నారని, ప్రజాస్వామ్య నాయకత్వానికి అణకువ అవసరమని హితవు పలికారు. కేరళలో అసలైన పోరాటం యూడీఎఫ్‌కు, బీజేపీ-ఎల్‌డీఎఫ్ కూటమికి మధ్యేనని ఆయన స్పష్టం చేశారు.

### అమరావతిపై నీ కుట్రలు ఇక సాగవు జగన్

వైసీపీ తీరు ఒక రాజకీయ పార్టీలా కాకుండా, ప్రజలను మభ్యపెట్టే 'డ్రామా కంపెనీ'లా తయారైందని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతి రాజధాని విషయంలో ఆ పార్టీ ఆడుతున్న నాటకాలు పరాకాష్ఠకు చేరాయని, 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు వ్యతిరేకంగా జగన్ చేస్తున్న కుట్రలు ఇకపై సాగవని ఆమె హెచ్చరించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైసీపీ నేతల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు.

**అసలు దోపిడీ అంటే ఏంటో తెలుసా?**

అమరావతిలో దోపిడీ జరుగుతోందని జగన్ ఆరోపించడంపై అనురాధ తీవ్రంగా మండిపడ్డారు. "జగన్ గారూ.. అసలు దోపిడీకి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడా మీకు తెలుసా?" అని ఆమె ప్రశ్నించారు. అసలైన దోపిడీ అంటే ఏంటో వివరిస్తానంటూ ఆమె పలు ఉదాహరణలు ఇచ్చారు. "తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో పద్ధతిలో వేల కోట్లు సంపాదించడాన్ని దోపిడీ అంటారు. అక్రమ ఆస్తుల కేసుల్లో ఇరుక్కుని ఏళ్ల తరబడి బెయిల్ మీద తిరగడాన్ని దోపిడీ అంటారు. వెంకట నరసయ్య అనే చేనేత కార్మికుడిని ముగ్గు గనుల కోసం పొట్టనబెట్టుకోవడాన్ని, 'సాక్షి' మీడియాను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేయడాన్ని, భారతి సిమెంట్స్ కోసం నిబంధనలు ఉల్లంఘించడాన్ని దోపిడీ అంటారు" అంటూ నిప్పులు చెరిగారు.

**మద్యం, భూముల కుంభకోణాలపై విమర్శలు**

"మద్యపాన నిషేధం అని చెప్పి, జే-బ్రాండ్ల మద్యాన్ని అమ్ముతూ డిజిటల్ చెల్లింపులు లేకుండా నెలకు రూ.100 కోట్లకు పైగా బ్లాక్ మనీని జేబులో వేసుకోవడాన్ని ఏమంటారు? ఉత్తరాంధ్రను ఉద్ధరిస్తామని చెప్పి, విశాఖలో 41 వేల ఎకరాల భూములను కొట్టేయడాన్ని దోపిడీ అంటారు. పందికొక్కుల్లా ఎర్రచందనాన్ని స్మగ్లింగ్ చేయడం, ఇసుకను బంగారం చేసి పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం వంటివన్నీ దోపిడీ కాదా?" అని అనురాధ ప్రశ్నించారు. అన్యమతస్తులను టీటీడీ చైర్మన్‌లుగా నియమించి, స్వామివారి సొమ్మును కొల్లగొట్టిన పాపం మిమ్మల్ని వెంటాడుతోందని ఆమె వ్యాఖ్యానించారు.

**అభివృద్ధిని అడ్డుకుంటున్న కుట్రలు**

అమరావతి అభివృద్ధిని ప్రపంచమంతా ప్రశంసిస్తుంటే, వైసీపీ నేతలు మాత్రం బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అంతర్జాతీయ యూనివర్సిటీలు, ఐటీ కంపెనీలు వస్తుంటే అడ్డుకోవడం మీ అవివేకం కాదా? పదేళ్లయినా రాజధాని లేదని దేశమంతా జాలి పడుతుంటే, మీకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు" అని విమర్శించారు. రాజధానిని ఎలా దెబ్బతీయాలా అనే కుట్రతోనే వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారితో ప్రెస్ మీట్లు పెట్టించి విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**లోకేశ్ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?**

గతంలో ముఖ్యమంత్రిగా జగన్ ఎన్ని అబద్ధాలు ఆడారో, ఎన్ని యూ-టర్న్‌లు తీసుకున్నారో నారా లోకేశ్ వీడియో సాక్ష్యాలతో సహా బయటపెట్టారని అనురాధ గుర్తుచేశారు. "లోకేశ్ గారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం మీకు ఉందా? అమరావతిపై అసెంబ్లీలో మాట్లాడిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న కుట్రలకు పొంతన లేదని ఆయన ట్వీట్ చేస్తే బదులివ్వలేకపోయారు" అని ఆమె అన్నారు. 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతుల గొప్పతనాన్ని ఓర్వలేకే ఈ కక్ష సాధింపు చర్యలని దుయ్యబట్టారు.

**ప్రజలు తిరస్కరించినా మారని వైఖరి**

ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తిరస్కరించినా వైసీపీ తీరు మారలేదని అనురాధ విమర్శించారు. "పార్టీని ఎలా బాగు చేసుకోవాలో ఆలోచించకుండా, ఇంకా అమరావతిపై విషం చిమ్ముతున్నారు. మీ సైకో తత్వాన్ని పక్కనపెట్టి వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోండి. అభివృద్ధిని అడ్డుకున్న పాపం మిమ్మల్ని వదిలిపెట్టదు" అని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర రాజధానిపై విషం చిమ్మడం ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ప్రతి కుట్రకు తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదని ఆమె స్పష్టం చేశారు.

# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...

**- మొదటి పేజీ తరువాయి**

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు.
కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్-19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి.
పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది

**- మొదటి పేజీ తరువాయి**

నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమరావతి పేరు పలకడానికి కూడా ఇష్టం లేని కొందరు పిచ్చి ముదిరి 'మావిగన్' అంటూ కొత్త పేరుతో పిలుస్తున్నారని, వారి ఫ్రస్టేషన్ చూస్తుంటే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు.

**రాష్ట్రానికి ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీ**

గత ప్రభుత్వ వైఖరిని దుయ్యబడుతూ, రాష్ట్రంపై పగ పట్టినట్లుగా వ్యవహరించారని చంద్రబాబు ఆరోపించారు. "బాబాయిని చంపి నా చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే చూసి సహించలేక అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారు. ఫ్యాక్షనిస్టులు, ముఠా నాయకుల కంటే ఘోరంగా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు" అని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని అమరావతేనని పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడంపై సీమ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, సభకు హాజరైన ప్రజలు 'జై అమరావతి' నినాదాలతో తమ మద్దతు తెలిపారని గుర్తుచేశారు.

**పెట్టుబడులు వస్తుంటే ఓర్వలేకపోతున్నారు**

గత పాలకులు రాష్ట్రంపై విద్వేషం చూపిస్తున్నారని, పెట్టుబడులు వస్తుంటే వారిని బెదిరించి తరిమేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. దేవాలయాలపై దాడులు చేసి, తిరుమల ప్రసాదం నాణ్యతను కల్తీ నెయ్యితో దెబ్బతీశారు. ఇలాంటి వారికి సహకరిస్తే ప్రజలందరికీ నష్టం జరుగుతుంది," అని హెచ్చరించారు. గత ప్రభుత్వం పెంచిన రూ.4,400 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని, తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత తమదేనని స్పష్టం చేశారు.

**జలధారతో ప్రతీ ఎకరాకు నీరు**

అంతకుముందు, 'జలధార' కార్యక్రమం కింద 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను, 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. నీరే సంపద అని, దాన్ని పొదుపుగా వాడితేనే సంపద సృష్టించగలమని అన్నారు. "పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని జలాశయాల్లో నిల్వ చేయాలి. నీరు-చెట్టు, పంట కుంటలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి కార్యక్రమాలతో గతంలోనే నీటి సంరక్షణకు బాటలు వేశాం. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించి రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చాం. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం," అని వివరించారు.

**పూర్వోదయతో సీమకు మహర్దశ**

రాయలసీమ అభివృద్ధికి ఒక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన 'పూర్వోదయ' పథకం ద్వారా రూ.30 వేల కోట్లు, పెట్టుబడుల ద్వారా మరో రూ.70 వేల కోట్లు సమీకరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. "గడిచిన 21 నెలల్లో చేపట్టిన జలసంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు 1.92 మీటర్ల మేర పెరిగాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే 2.2 మీటర్ల పెరుగుదల కనిపించింది. 20 వేలకు పైగా ఎండిన బోర్లలో నీళ్లు వచ్చాయి. రూ.96 కోట్ల విద్యుత్ ఆదా అయ్యింది" అని తెలిపారు. శ్రీశైలం నుంచి ఎత్తిపోతల ద్వారా నీరు తెచ్చి, పట్టిసీమ నీటిని కృష్ణా డెల్టాకు ఇచ్చి, ఆదా చేసిన నీటిని సీమకు తరలించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ చేసిన కృషి ఫలించింది. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' పరిధిలోకి పిఠాపురం స్టేషన్‌ను చేర్చుతూ రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో పిఠాపురం స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. కొద్ది నెలల క్రితం తన ఢిల్లీ పర్యటనలో భాగంగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆవశ్యకతను ఆయనకు సమగ్రంగా వివరించారు. పురాణ ప్రాధాన్యం ఉన్న పిఠాపురం పట్టణానికి దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ నొక్కిచెప్పారు. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు. నిజానికి, పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో పిఠాపురంలో పర్యటించినప్పుడు ఆయన క్షేత్రస్థాయిలో స్టేషన్‌ను పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, దుర్గంధం వెదజల్లడం గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఆనాడే స్టేషన్ రూపురేఖలు మార్చాలని ఆయన నిశ్చయించుకున్నారు. పవన్ కల్యాణ్ అభ్యర్థన పట్ల కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడంతో, ఇక పిఠాపురం స్టేషన్ సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. ఈ నిధులతో స్టేషన్ ప్రధాన భవనం, ముఖద్వారం నిర్మాణం, ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, కొత్త షెల్టర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గది, అత్యాధునిక టాయిలెట్లు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్ పనులను కూడా పూర్తి చేయనున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. తాను అడిగిన వెంటనే పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, తక్షణం స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కూడా పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

# కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్...

మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరాన్ తన సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తూ ఓ సరికొత్త స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్‌ను బయటికి తీసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) అభివృద్ధి చేసిన ఈ డ్రోన్‌కు 'హదీద్-110' అని పేరు పెట్టారు. ఇది ఇప్పటికే యుద్ధరంగంలో వినియోగంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి రాడార్లకు చిక్కకుండా, వేగంగా దూసుకెళ్లి లక్ష్యాలను ధ్వంసం చేసేలా దీన్ని రూపొందించినట్లు ఇరాన్ అధికారిక మీడియా సంస్థ తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోలో వెల్లడించింది. ఈ కొత్త డ్రోన్ ఇరాన్ డ్రోన్ టెక్నాలజీలో ఒక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది సూసైడ్ డ్రోన్ తరహాలో పనిచేస్తుంది. అంటే, లక్ష్యాన్ని చేరుకుని, తనను తాను పేల్చుకుని విధ్వంసం సృష్టిస్తుంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్లు, కమాండ్ సెంటర్లు, కీలకమైన మౌలిక సదుపాయాలే దీని ప్రధాన లక్ష్యాలు. ఇరాన్ ఇప్పటివరకు వినియోగిస్తున్న షాహెద్-136 డ్రోన్‌తో పోలిస్తే, హదీద్-110 దాదాపు మూడు రెట్లు వేగవంతమైనది కావడం గమనార్హం. ఇది గంటకు సుమారు 510 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. హదీద్-110 డ్రోన్‌లో 30 కిలోల బరువున్న శక్తివంతమైన పేలుడు పదార్థాలను (హై ఎక్స్‌ప్లోసివ్ వార్‌హెడ్) అమర్చవచ్చు. దీని పరిధి సుమారు 350 కిలోమీటర్లు కాగా, దాదాపు గంటపాటు గాలిలో ఎగరగలదు. కాంపాక్ట్ జెట్ ఇంజిన్‌తో పనిచేసే ఈ డ్రోన్, డెల్టా-వింగ్ డిజైన్‌ను కలిగి ఉంది. ఈ ప్రత్యేక ఆకృతి వల్లే రాడార్ సిగ్నల్స్‌కు సులభంగా చిక్కకుండా (తక్కువ రాడార్ క్రాస్-సెక్షన్) స్టెల్త్ సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది. దీన్ని నేరుగా కాటపల్ట్ ద్వారా గాల్లోకి ప్రయోగించి, ఆ తర్వాత జెట్ ఇంజిన్‌ను స్టార్ట్ చేసి ముందుకు పంపిస్తారు. ఇప్పటికే ఈ డ్రోన్‌ను ఉపయోగించి అమెరికా సైనిక స్థావరాలు లేదా సంబంధిత లక్ష్యాలపై తొలి దాడులు జరిగాయని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. షాహెద్ వంటి నెమ్మదైన డ్రోన్లను ఎదుర్కోవడానికి అలవాటుపడిన అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాల రక్షణ వ్యవస్థలకు ఈ వేగవంతమైన స్టెల్త్ డ్రోన్ కొత్త సవాలుగా మారింది. హదీద్-110 రాకతో మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధ తంత్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇది ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత క్లిష్టతరం చేస్తుందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జగన్ ప్రతిపాదన అవినీతిపై ఎక్కుపెట్టిన 'గన్'లా ఉంది

వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' కాన్సెప్ట్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబులో వణుకు మొదలైందని మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. విశాఖపట్నంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో అద్భుతమైన రాజధానిని నిర్మించవచ్చనే జగన్ ఆలోచన కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని ఎద్దేవా చేశారు. అమరావతి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం... మరోవైపు రాష్ట్రంలో జీతాలకు కూడా డబ్బులు లేవని ఆర్థిక మంత్రి ద్వారా చెప్పించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అమరావతిపై చంద్రబాబు చేస్తున్న ఖర్చు కేవలం అవినీతి కోసమేనని, జగన్ ప్రతిపాదన ఆ అవినీతిపై ఎక్కుపెట్టిన 'గన్'లా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి అమరావతిని 'కమ్మరావతి' అని సంబోధించినా కూటమి నేతలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. ఏబీఎన్ రాధాకృష్ణ తన రాతల ద్వారా జగన్‌పై విషం చిమ్ముతున్నారని, జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారనే భయమే వారిని ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పురిగొల్పుతోందని కన్నబాబు వ్యాఖ్యానించారు.

# ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ...

## ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ చీఫ్, మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ ఖదేమీ మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనపై ఐఆర్‌జీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది నేరపూరిత ఉగ్రవాద దాడి అని, ఈ దాడిలో ఖదేమీ 'షహీద్' (అమరుడు) అయ్యారని పేర్కొంది. అయితే, దాడి ఎక్కడ జరిగిందనే ప్రదేశాన్ని మాత్రం ఐఆర్‌జీసీ వెల్లడించలేదు. ఇరాన్ భద్రతా వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన నిఘా విభాగానికి ఖదేమీ నాయకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి జరుగుతున్న దాడుల్లో ఇరాన్ అనేక మంది ఉన్నతాధికారులను కోల్పోయింది. గత నెలలోనే ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌లను ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. అంతకుముందు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పక్‌పూర్, బసీజ్ ఫోర్స్ చీఫ్ ఘోలామ్‌రెజా సొలైమానీ వంటి కీలక నేతలు కూడా ఈ దాడుల్లో మరణించారు. ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడిలోనే ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన్ను కూడా లక్ష్యంగా చేసుకుంటామని అమెరికా, ఇజ్రాయెల్ హెచ్చరించింది.

## ఏలూరు జిల్లాలో వర్షం, ఈదురుగాలుల బీభత్సం

**- మొదటి పేజీ తరువాయి**

జంగారెడ్డిగూడెం సమీపంలోని వేగవరం ప్రధాన రహదారిపై ఓ భారీ వృక్షం విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలివాన ధాటికి మామిడి, జీడి తోటల్లో కాయలు పెద్ద ఎత్తున నేలరాలాయి. మరో నెల రోజుల్లో కోత కోసి మార్కెట్‌కు తరలించాల్సిన మామిడి పంట కళ్ల ముందే దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మామిడితో పాటు కోతకు సిద్ధంగా ఉన్న వరి, అరటి, జీడిమామిడి వంటి ఇతర పంటలు కూడా తీవ్రంగా నష్టపోయాయని రైతులు వాపోతున్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి, కష్టపడి పండించిన పంట ఇలా అకాల వర్షానికి నాశనం కావడం తమను ఆర్థికంగా కుంగదీసిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులు పంట నష్టంపై అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక పంపిన తర్వాత రైతులకు నష్టపరిహారం అందే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది.

# పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు

కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాకిస్థాన్ సోషల్ మీడియా సమాచారం ఆధారంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ భారత ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపించారు. అసోంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పాకిస్థాన్ పాటనే పాడిందని మండిపడ్డారు. ఈ సంబంధం ఎప్పటి నుంచో సాగుతోందని అన్నారు. జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ నాయకులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఇటీవల రెండు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వారు పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్లు గుర్తించామని ఆరోపించారు. నిన్న పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ ఢిల్లీలో, గౌహతిలో రెండు మీడియా సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా వారు మాట్లాడిన సమాచారం పాక్ సోషల్ మీడియా నుంచి తీసుకున్నదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోంలో ఎన్నికలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు పడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలు నిర్వహించిందని, ఇలా ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదని తెలిపారు. ఈ ప్రతి టాక్ షోలోనూ కాంగ్రెస్ గెలవాలని పాకిస్థాన్ మీడియా కోరుకుందని వెల్లడించారు.

**కాంగ్రెస్ ఆరోపణలపై ముఖ్యమంత్రి ఆగ్రహం**

హిమంత బిశ్వశర్మ భార్యకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీనితో పాటు ఆమె ఆస్తులను అఫిడవిట్‌లో పేర్కొనలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలపై హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినందుకు కేసు నమోదు చేయవచ్చని అన్నారు. ఎన్నికల సమయంలో కావాలని ఇలాంటి ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇందుకు కాంగ్రెస్ శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. తనపై చేసిన ఆరోపణలకు గాను తన భార్య కేసు పెట్టినట్లు హిమంత బిశ్వశర్మ తెలిపారు. పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని అన్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# నవతరం పార్టీ అధ్యక్షుడిగా చెప్పుకునే సుబ్రహ్మణ్యం పై పల్నాడు ఎస్పీకి ఎమ్మార్పీఎస్ ఫిర్యాదు

## రాజ్యాంగ వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం మోపాల్సిందే




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 06: చిలకలూరిపేట : రాజ్యాంగం కల్పించిన ఎస్సీ రిజర్వేషన్లను, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సామాజిక విద్వేషాలు రెచ్చగొడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గళమెత్తింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు, పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్ మాదిగ నేతృత్వంలో సోమవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

తప్పు చేసిన వాడే.. రివర్స్ కేసు పెడతారా?

గతంలో చిలకలూరిపేట పట్టణానికి చెందిన నవతరం పార్టీ అధ్యక్షుడిగా చెప్పుకునే సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి, తన కార్యాలయంలో బహిరంగంగా ఎస్సీ రిజర్వేషన్లను మరియు ఎస్సీ ఎస్టీ చట్టాన్ని రద్దు చేయాలని కరపత్రాలు విడుదల చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఎమ్మార్పీఎస్ నేతలు మండిపడ్డారు. దీనిపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటా సుబ్బు మాదిగ సదరు వ్యక్తిని మర్యాదపూర్వకంగా కలిసి వివరణ కోరగా, సరైన సమాధానం చెప్పకపోగా.. ఇప్పుడు రివర్స్ కేసులకు తెరలేపారని ధ్వజమెత్తారు.

తప్పుడు ఎఫ్.ఐ.ఆర్ లతో భయపెట్టలేరు

కోటా సుబ్బు తన అనుచరులతో వచ్చి దాడి చేశారంటూ సుబ్రహ్మణ్యం పోలీసులకు అబద్ధపు ఫిర్యాదు చేయడాన్ని ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండించింది. బాధితుడినే నిందితుడిగా చిత్రీకరిస్తూ కోర్టు కానిస్టేబుల్ ద్వారా ఫోన్ చేయించి బెదిరింపులకు దిగడం హేయమని నేతలు పేర్కొన్నారు. "చట్టాన్ని రద్దు చేయమన్న వాడే చట్టం ముసుగులో తప్పుడు కేసులు పెట్టడం విడ్డూరంగా ఉంది" అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎస్పీ హామీ పూర్తి విచారణ జరిపి న్యాయం చేస్తాం. ఈ మేరకు ఎస్పీ గారిని కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోటా సుబ్బు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జమ్మలమూడి విజయ మాదిగ మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# వింజమూరులో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.






(పెన్ పవర్ ప్రతినిధి వింజమూరు ఏప్రిల్ 6) నెల్లూరు జిల్లా వింజమూరు మండలం వింజమూరు పాత బస్టాండ్ లో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బిజెపి మండల అధ్యక్షులు అంబటి ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వడ్డే శ్రీనాద్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలే పరమావధిగా ఆవిర్భవించిన భారతీయ జనతా పార్టీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు ? అంత్యోదయ లక్ష్యంతో సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ఫలాలు అందేలా బిజెపి కృషి చేస్తోందని తెలిపారు. ?పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ? మండల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యాక్షులు ఎం నాగేశ్వర్ రెడ్డి, నాయకులు భువన సుబ్బారెడ్డి, గని రమణయ్య,రాంచంద్ర, మహేశ్వర్, శ్రీనాథ్, నాగేంద్ర, , రాజేష్, దాసరి ప్రసాద్, నాగేశ్వరావు ఎం, రాజ రమేష్, రాజా సాయి ఇతర నాయకులు ఉన్నారు.

# బాధితులను ఆదుకునేందుకు పార్టీలకు, కులమతాలకు అతీతంగా దాతలు మానవత్వంతో ముందుకు రావాలి-కడవకొల్లు







చల్లపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 6 బాధితుల ఇంటికి వెళ్ళి పరామర్శ-రూ.5వేలు ఆర్థిక సాయం ఆపదలో ఉన్న బాధితులను ఆదుకునేందుకు కులమతాలు, పార్టీలు అడ్డుకాకూడదని వారికి చేయగలిగినంత చేసేందుకు దాతలు స్పందించి మానవత్వంతో ముందుకు రావాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, దివి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు కోరారు. ఇటీవల మండల పరిధిలోని మంగళావురం అంబేద్కర్ కాలనీలో కర్రా లక్ష్మయ్య పూరిల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఆ పూరింటిలో తలదాచుకుంటున్న కర్రా లక్ష్మయ్య, ఆది శేషమ్మ, వారి చిన్న కూతురు కమల తన ముగ్గురు కుమార్తెలు, లక్ష్మయ్య పెద్ద కుమార్తె విమల కుమారుడు జయరాజు మొత్తం ఏడుగురు. నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న కడవకొల్లు నరసింహారావు సోమవారం ఉదయం లక్ష్మయ్య ఇంటికి వెళ్ళి అందర్నీ వరామర్శించారు. కాలిపోయిన ఇంటిని, సామాగ్రిని పరిశీలించారు. మంటల్లో తనకు కూడా గాయలైనట్లు లక్ష్మయ్య కడవకొల్లుకు చూపించారు. చలించిన కడవకొల్లు వెంటనే రూ. 5వేలు బాధితులకు అందజేశారు. అవసరమైతే లక్ష్మయ్యకు కాలిన గాయాలకు చికిత్సకు సహకారం అందిస్తానని చెప్పారు. అందరూ ధైర్యంగా ఉండాలని త్వరలోనే అన్ని చక్కబడతాయని ధైర్యం చెప్పారు. బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలి-కడవకొల్లు అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన లక్ష్మయ్య కుటుంబానికి సాయం అందించేందుకు పార్టీలకు, కులమతాలకు

అతీతంగా దాతలు మానవత్వంతో ముందుకు రావాలన్నారు. చేయగలిగినంత సాయం అందించి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కడవకొల్లు నరసింహారావు వెంట మంగలావురం వైసిపి నాయకులు చంద్ర చిన్ని బాబు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జుజ్జువరవు భాగ్యారావు, మండల అధ్యక్షుడు మెరుగు రమేష్, మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్ నజీర్, కుసుమ, ముచ్చు శివనాగరాజు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 97 అర్జీలుప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలి...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..



విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 06: ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీ ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి ప్రతీక అని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి అధికారి బాధ్యత అని, జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 97 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిస జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 17, పోలీసు శాఖకు 14, రెవెన్యూ శాఖకు 11, వైద్య ఆరోగ్యానికి 8 అర్జీలు వచ్చాయన్నారు. అదేవిధంగా విభిన్న ప్రతిభావంతులు, విద్య, పంచాయతీరాజ్ శాఖలకు అయిదేసి చొప్పున అర్జీలు వచ్చినట్లు వివరించారు. వ్యవసాయం, గృహ నిర్మాణం, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఆర్ అండ్ బీ, భవనాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్యకు రెండు చొప్పున అర్జీలు రాగా విద్యుత్, జెడ్పీ సీఈవో, పౌర సరఫరాలు, ఎండోమెంట్, మత్స్య, అడవులు, కార్మిక, మార్కెటింగ్, కాలుష్య నియంత్రణ, ఆర్ఐవో, గ్రామీణ నీటి సరఫరా, ఎస్సీ కార్పొరేషన్, సాంఘిక సంక్షేమ శాఖలకు ఒక్కో అర్జీ వచ్చినట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై అధికారులు క్రమంతప్పకుండా ఫాలోఅప్ చేయాలని, సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని.. ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి, సమస్యల మూల కారణాలను గుర్తించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు...

# పారిశుధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదు.. కమిషనర్ మయూర్ అశోక్.....






గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: గుంటూరు నగరంలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ హెచ్చరించారు. సోమవారం శ్రీనగర్, పిఎస్ నగర్, వసంతరాయపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనుల తీరును పరిశీలించి, పలుచోట్ల పేరుకుపోయిన చెత్తను, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైన్లను చూసి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సుందరీకరణ మరియు ప్రజారోగ్యం విషయంలో ఎటువంటి రాజీ పడబోమన్నారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ప్రజారోగ్య అధికారులు మరియు సచివాలయ కార్యదర్శుల పనితీరులో ఆశించిన మార్పు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా పనిచేయని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిరోజూ నూరు శాతం ఇంటింటికీ చెత్త సేకరణ జరగాలని, అలా జరిగినప్పుడే రోడ్ల మీద చెత్త వేసే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ చెత్త సేకరణ సక్రమంగా జరుగుతున్నప్పటికీ, రోడ్ల మీద లేదా ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై భారీ అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అలాగే, రోడ్ల పక్కన పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను తక్షణమే తొలగించాలని, దీనిపై పర్యవేక్షణ పెంచాలన్నారు. నగర రోడ్లపై ఆవుల సంచారం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లపై కనిపించే ఆవులను వెంటనే జీఎంసి గోశాలకు తరలించాలని ఆదేశించారు. గ్యాంగ్ వర్క్ నిర్వహణ సరిగా లేకపోవడంపై అధికారులను నిలదీస్తూ, ఇకపై గ్యాంగ్ వర్క్ పిన్ పాయింట్ గా పక్కాగా జరగాలని, లేనిపక్షంలో సంబంధిత ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం 146వ సచివాలయంలోని ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను పరిశీలించి, సెంటర్లను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చే వ్యర్థాలను

శాస్త్రీయంగా పునర్వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్ఎస్ లు సాంబయ్య, ఐజాక్, ప్రజారోగ్యాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు....

# రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని కలిసిన కత్తెర దంపతులు...



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: ఆంధ్రప్రదేశ్,రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిష్టినా , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించి పలు విషయాలపై చర్చించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కు రిజిస్ట్రేషన్ శాఖ నుండి రావలసిన 34 కోట్ల రిజిస్ట్రేషన్ సర్ చార్జీల గురించి మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా, వాటి విడుదలకు కృషి చేస్తానని సంబంధిత శాఖతో మాట్లాడి రావాల్సిన సర్చార్జీలు విడుదల చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాలనాపరమైన అంశాల గురించి కత్తెర దంపతులతో చర్చించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వాటి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. గుంటూరు జిల్లా పరిషత్తులో జరుగుతున్న పరిణామాలపై కూడా కత్తెర దంపతులతో మంత్రి లోకేష్ సుదీర్ఘంగా చర్చించారు. వాటి పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. పాలనాపరంగా పార్టీ పరంగా తన పూర్తి సహకారాన్ని అందిస్తానని కత్తెర దంపుతులకు తెలిపారు....

# నీటి భద్రతకు సమష్టిగా ముందడుగు వేద్దాం.... విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..



విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 06: నీటి వనరుల పరిరక్షణ, సమర్థ వినియోగం, భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రారంభమైన జలధార- నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా ముందడుగు వేద్దామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జల వనరుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యతకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దార్శనికతతో నీటి భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించారని.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పటిష్ట కార్యాచరణతో జల వనరుల పరిరక్షణకు కృషిచేద్దామన్నారు. గౌరవ సీఎం నేతృత్వంలో ఇప్పటికే జల భద్రతకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని.. ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేద్దామని పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ..ఏప్రిల్ 6 నుంచి జులై 14 వరకు 100 రోజుల కార్యక్రమం జరగనుందని.. నీటి సంరక్షణ, భూగర్భ జల పునరుద్ధరణపై ప్రత్యేకంగా దృష్టిసారించి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమీకృత నీటి నిర్వహణ, చెరువులు-కాలువల పునరుద్ధరణ, చెరువుల అనుసంధానం, నీటి సంరక్షణ విధానాలు, పచ్చదనం పెంపొందించడం, గ్రామ నీటి బడ్జెట్ లక్ష్యాలతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. భాగస్వామ్య పక్షాలు క్రియాశీలంగా పాల్గొని వీటిని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నీటి వనరుల అధికారి (డీడబ్ల్యూఆర్వో) పి.రామచంద్రరావు, ఈఈ రామకోటయ్య, డీఈబాబురావు, జల వనరుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.....

# పీకల వాగు కాలువ పూడిక తీత పనులను సమీక్షించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి..





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత అనే 100 రోజుల కార్యక్రమంలో భాగంగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పూడిక తీత పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం 2026 ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యక్షంగా పనులను పరిశీలించారు. పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సమీపం నుండి ఏటి అగ్రహారం వరకు చేపట్టనున్న పూడిక తీత పనులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్షించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చల్లా ఓబులేసు , డివిజన్ అధ్యక్షులు పోపూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు...

# జాబ్‌లెస్ క్యాలెండర్ కాదు - జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. - డి.వై.ఎఫ్.ఐ





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను సవరించి కనీసం లక్ష పోస్టులతో కూడిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డివైఎఫఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్ అన్నారు. నేడు గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ కి పూర్తిఖాళీలు భర్తీ చేసే విధంగా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, రాజధాని నిర్మాణంలో స్థానిక యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వై.కష్ణకాంత్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ అన్న చెప్పిన మాట నమ్మి గెలిపిస్తే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి తీర రెండు సంవత్సరాల తర్వాత కేవలం 10060 ఉద్యోగాలతో జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసి ఉగాది పండుగ చేసుకోమని చెప్పడం అన్యాయమన్నారు. అసలు రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక ప్రతి ఏటా డీఎస్సీ విడుదల చేస్తామని నిరుద్యోగ యువత చదువుకోవాలని ముఖ్యమంత్రి డీఎస్సీ సభలో ఘనంగా ప్రకటించారని, ఫిబ్రవరి అని, మార్చి అని ఇప్పుడేమో ఏకంగా అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని 2565 పోస్టులు చూపించడం ఎంతవరకూ సమంజసమన్నారు. ఇందులో కూడా ఒక్క పిఈటీ పోస్టు లేదు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు లేని పరిస్థితి ఉందన్నారు. జూన్‌లో రిటైర్డ్ అయ్యే వారిని దృష్టిలో ఉంచుకుని డీఎస్సీ పోస్టులు పెంచాలన్నారు. ఒక్క పోలీస్ కానిస్టేబుల్ ఖాళీలే 10,762 పోస్టులు ఉన్నాయని హోంమంత్రి శాసనసభలో ప్రకటించారని. జాబ్ క్యాలెండర్‌లో మాత్రం కేవలం 1970 పోస్టులు చూపడం అన్యాయమన్నారు. గ్రుప్ 1,2 ఉద్యోగాలు 5000 పైగా ఖాళీలు ఉంటే కేవలం 841 జాబ్ క్యాలెండర్ లో పేర్కొన్నారు. యూనివర్సిటీలో 4వేలకు పైగా ఖాళీలు ఉన్నాయని విద్యశాఖ మంత్రిగారే స్వయంగా ప్రకటించారని, జాబ్ క్యాలెండర్‌లో మాత్రం 1500 పోస్టులను మాత్రమే చూపటం దారుణమన్నారు. ముఖ్యంగా ఇందులో ఎపి జెన్కో, ట్రాన్స్కో, డిస్కాం ఒక్క పోస్టు చూపించలేదు. అన్నింటి కన్నా ముఖ్యమైంది వయోపరిమితి అన్ని రకాల గ్రూప్స్ పరీక్షలకు 47కు పెంచాలి. డీఎస్సీకి 49కు, పోలీస్ కానిస్టేబుల్ కు 35కు పెంచాలి. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున వయోపరిమితి సడలింపు ఇవ్వాలి. రాష్ట్రంలో 25 లక్షలమంది నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూశారు. కానీ వారి ఆశలను అడిఅశలు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం పై నమ్మకంతో అప్పులు చేసి తిని తినక పస్తులుండి చదువుకున్నారు. వారికి న్యాయం చేయాలి. తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను సవరించి కనీసం లక్ష పోస్టులతో కూడా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫఐ) గా డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర రాజధాని గుంటూరు జిల్లాలోని తుళ్ళూరు ప్రాంతంలో ప్రకటించిన తర్వాత ఆ ప్రాంతంలోని రైతాంగం రాజధాని కోసం పెద్ద ఎత్తును భూములు ఇచ్చారని, రాజధాని అభివృద్ధి వలన ఆ ప్రాంతంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని భావించారన్నారు. అచరణలో రాజధాని నిర్మాణ అభివృద్ధిలో ఈ ప్రాంతంలోని యువతీయువకులకు ప్రాతినిధ్యంలేదన్నారు. ఇంజినీరింగ్, టెక్నికల్ విద్య చదువుకున్న ఎంతో మంది ఖాళీగా ఉన్న పరిస్థితి ఉందన్నారు. రాజధాని నిర్మాణాలలో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి తీసుకువచ్చి పనిచేయిస్తున్నారన్నారు. ఎంతో విలువైన భూములు ఇచ్చిన ఆ ప్రాంత వాసులకు రాజధాని నిర్మాణంలో అకాశం కల్పించకపోవడం సరికాదన్నారు. మొదటి ప్రయారిటీగా స్థానికులకు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత బయట నుండి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్జీ ఇచ్చిన వారిలో డి.వై.ఎఫ్.ఐ నాయకులు ఎస్.కె.సమీర్, నిరుద్యోగులు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు..

# నాదెండ్ల మనోహర్ రాజకీయ ప్రస్థానం నేటి యువతకు ఆదర్శనీయం..జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి..





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: రాజకీయాల్లో ఉన్నత విలువలకు , విశ్వసనీయతకు నిలువెత్తురూపంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ నిలుస్తారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. తాను చేపట్టిన ప్రతీ పదవికి అత్యున్నతమైన గౌరవాన్ని , విలువను పెంచిన గొప్ప నాయకుడు నాదెండ్ల మనోహర్ అంటూ అయన కొనియాడారు. సోమవారం నాదెండ్ల మనోహర్ పుట్టినరోజు సందర్భంగా నగర జనసేన కార్యదర్శి షేక్ మెహబుబ్ బాషా ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోట గాజు గ్లాస్ దిమ్మె వద్ద జరిగిన వేడుకలకు ఆళ్ళ హరి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాణాసంచా కాల్చుతూ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఆళ్ళ హరి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతిగా నాదెండ్ల మనోహర్ అసెంబ్లీని ఎంతో హుందాగా నడిపిన తీరును ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను , సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లటంలో మనోహర్ ది కీలకపాత్ర అని ఆళ్ళ హరి అన్నారు. పత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ కొర్రపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ జనసేన పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు అండగా భుజం కాసి కొండంత అండగా మనోహర్ నిలిచారన్నారు. జనసేన పార్టీ బలోపేతంలో మనోహర్ కృషి వెలకట్టలేనిదని కొర్రపాటి నాగేశ్వరావు అభివర్ణించ్చారు. బీజేపీ మాజీ కార్పొరేటర్ నేరెళ్ల మాధవరావు మాట్లాడుతూ మృదు స్వభావి అయిన నాదెండ్ల మనోహర్ రాజకీయ ప్రస్థానం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మిర్చీయార్డ్ డైరెక్టర్ శ్రావణ కుమారి , కోలా అంజి , వడ్డే సుబ్బారావు , స్వామి, బీజేపీ రంగా , బియ్యం శ్రీను , తోట గోపి , బాలాజీ , సుబ్బారావు , విమల , గోపు సాంబశివరావు హఫీజ్ , కోటంశెట్టి బాలు , జక్కా రాఘవులు , తాడికొండ శ్రీను,దూలిపూడి సుబ్బారావు , లోకేష్ , బాలాజీ తదితరులు పాల్గొన్నారు...

# అగ్నిపుత్రి (మిస్సైల్ ఉమెన్) టెస్సీ థామస్ కు గౌరవ డాక్టరేట్

అనంతపురం పెన్ పవర్, ఏప్రిల్, 06: అగ్నిపుత్రిగా పిలిచే భారతదేశ క్షిపణి మహిళ (మిస్సైల్ ఉమెన్) టెస్సీ థామస్ ను గౌరవ డాక్టరేట్ వరించింది. సోమవారం అనంతపురం జెఎన్‌టియు 15 వ స్నాతకోత్సవం సందర్భంగా .... భారతదేశ క్షిపణి మహిళ (మిస్సైల్ ఉమెన్) గా ఖ్యాతి దక్కించుకున్న టెస్సీ థామస్ కు గౌరవ డాక్టరేట్ ను ఇచ్చారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్, వర్షిటీ చాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్ ను ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో డాక్టర్ టెస్సీ థామస్ కు అందజేశారు. ఈమె కేరళలోని త్రిశూర్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, పుణెలో ఎంటెక్, మిస్సైల్ గైడెన్స్ లో పీహెచ్ డి పూర్తి చేశారు. 1988లో డీఆర్డీఓలో చేరి, అగ్ని సిరీస్ క్షిపణుల అభివృద్ధిలో, ముఖ్యంగా అగ్ని-2, 3, 4, 5 క్షిపణుల గైడెన్స్, నావిగేషన్ సిస్టమ్ లో కీలక పాత్ర పోషించారు. టెస్సీ థామస్ కు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మార్గదర్శకులు. ఇంతటి ఘనత సాధించిన అగ్ని పుత్రి టెస్సీ థామస్ భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ)లో టెస్సీ థామస్ ఏరోస్పేస్ ఇంజినీర్ పని చేశారు.



# ఎక్కడ నుంచి ఆయన పోటీ చేసే దమ్ము ధైర్యం ఉందా జగన్మోహన్ రెడ్డికి..రాచకొండ లక్ష్మయ్య..



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: ఆంధ్రప్రదేశ్లో ఏ నియోజకవర్గంలో నుంచి ఆయన పోటీ చేసే దమ్ము ధైర్యం ఉందా?? జగన్మోహన్ రెడ్డికి ఈరోజు పేటీయం బ్యాచ్ కానీ, వైసీపీ అధికార ప్రతినిధులు కానీ అనే మాట. దమ్ముంటే విడి విడిగా పోటీ చెయ్యండి. ముగ్గురు కలిసి కాదు. మావాడు సింహం, సింగిల్" నిజమే అనుకుందాము. నేను ఒక మాట చెబుతాను. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటిసారి 1978లో పోటీ చేసింది చంద్రగిరి. తరువాత నాటి నుంచి, నేటి వరకు పోటీ చేస్తుంది కుప్పం. అది ఆయన కష్టపడి ఏర్పాటు చేసుకున్నాడు. కానీ, ఆయన తనయుడు లోకేష్ ఎక్కడా చంద్రగిరి తీసుకోలేదు, కుప్పం అడగలేదు. అసలు చిత్తూరు నుంచి ఎక్కడా పోటీ చెయ్యలేదు. ఆయన పోటీ చేసింది, గుంటూరు జిల్లాలో ఉన్న మంగళగిరి నియోజకవర్గం. మొదటిసారి అనుభవం లేక ఓడిపోయాడు. కానీ, పట్టుదలతో పోరాడి, మరలా అక్కడే నిలబడి, కలబడి, పోటీ చేసి మరీ గెలిచాడు. ఇకపోతే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా మొదట గాజువాక, భీమవరం లో పోటీ చేసి, ఓడిపోయాడు. తరువాత పిఠాపురం లో నిలబడ్డాడు. కాపు హేమాహేమీలు అందరూ అతనిని ఒడకొడతాము అని జబ్బలు చరిచారు. కానీ, నిలబడి, కలబడి గెలిచాడు. వీరిద్దరూ కూడా, తమకు ఏమాత్రం స్థానం, సంబంధం లేని చోట నిలబడి జనాలను మెప్పించి గెలిచారు. మరి, మీ పులివెందుల పులి మాత్రం ఎందుకు పులివెందుల వదిలి బయటకు వచ్చి, గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కానీ, విశాఖపట్నం నుంచి కానీ ఎందుకు పోటీ చెయ్యడు. ఎందుకు సేఫ్ నియోజకవర్గం లోనే పోటీ చేస్తాడు? అంటే, అక్కడ కాకపోతే, ఎక్కడా గెలవలేను అని భయమా? 2019లో ఏమన్నారు? 2024 లో కూడా ఏమన్నారు? 175/175 మీవి అన్నారు. అంటే, మీవాడికి అంత మందాన పేరు ప్రతి నియోజకవర్గంలో ఉంటే, రేపటి 2029లో పులివెందుల వదిలేసి, పోటీ చేసి గెలవమనండి. అప్పుడు మీ వాడు సింహం అంటాము మేము కూడా. అంతే కానీ, తండ్రి, బాబాయి కలిసి కంచుకోటగా మార్చిన చోటు నుంచి మాత్రమే ఎందుకు? వదిలేయ్. నీ సొంతంగా ఒక నియోజక వర్గం ఏర్పాటు చేసుకో. పేరు, ఊరు లేనివాడు, పూర్వీకుల నియోజకవర్గం ఆశిస్తాడు. కానీ, రాష్ట్రమంతా నాయకత్వం ఉన్నవాడు, ఒక పార్టీ అధినేత, అక్కడ కాకపోతే, మరొక చోట గెలవలేను, సొంతంగా నియోజకవర్గం ఏర్పాటు చేసుకోలేను అంటే, మీ వాడు నిజంగా దమ్ము ఉన్నవాడా? పైగా, సొంతంగా పార్టీ పెట్టుకోవటం చేతకాక, ఎవడో పెట్టుకున్న, రిజిస్టర్ చేసుకున్న పార్టీ కబ్జా చేసి, ఆది నా పార్టీ అని చెప్పుకోవటం నిజంగా సిగ్గుచేటు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు మీకు, ఇదే సవాల్. మీరు సింహాలు అయితే, మీకు దమ్ము ఉంటే,పులివెందుల వదిలేసి కోస్తా, ఉత్తరాంధ్రలో ఎక్కడి నుంచైనా పోటీ చెయ్యండి జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య హెచ్చరించారు..

# భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్..





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: బిజెపి తాడికొండ మండల అధ్యక్షులు బండ్ల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు పెద్ద ఎత్తున పాల్గొన్న బిజెపి నాయకులు కార్యకర్తలు... బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో పార్టీ పతాకాలు ఆవిష్కరణ. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టటానికి గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రారంభించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 16వేల గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తాం. ప్రతి జెండా దిమ్మ పై క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధి లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు గ్రామస్తులు కు తెలిసే విధంగా ఏర్పాటు. తాడికొండ నియోజకవర్గం పరిధిలోని మోతడక గ్రామంలో వికసిత భారత పేరుతొ ఎన్నో అభివృద్ధి పథకాలు అమలు చేపట్టాం. జిల్లాలో ప్రతి ఇంటికి బీజేపీ జెండాఎగురవేసి అందరికి తెలిపే బాధ్యత మనదే. కేంద్రం ప్రభుత్వం అందించే పథకాలు పేదలకు అందించడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోంది. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అనేక రకాల అభివృద్ధి పథకాలతో దూసుకుపోతున్నది. రాష్ట్రంలో డబుల్ ఇంజెన్ సర్కార్ నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. పేదమహిళల కష్టాలను కళ్లారా చుసిన ప్రధాన మంత్రి వాటి నుంచి ఆదుకోవడశీ కోసమే స్వచ్ఛభారత్ ని తోట్టతొలిగా అమలు చేసి 80 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం దేశావ్యాప్తంగా చేపట్టారు. అభివృద్ధి పథకాలు దేశావ్యాప్తంగా 90శాతం నిధులు కేంద్రం ఇస్తే 10శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తే అభివృద్ధి ఫలాలు రాష్ట్రాలలో అందుతున్నాయి. మోతడక గ్రామానికి 3కోట్ల రూపాయలు కేంద్రం ప్రభుత్వం అందించింది. 685 మందికి ఉపాధి హామీ పనులు 120 రోజులు ఇవ్వడం జరిగింది. జల జీవన్ మిషన్ కింద కోటి ఇరవై నాలుగు లక్షల నిధులుఇచ్చి త్రాగునీటిని ప్రతి ఇంటికి ఇవ్వడం జరిగినది. ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద పేదలకు పక్కా ఇళ్ళు, ఉచిత టీకా మందులు, బాలింతలకు ఉచిత మందులు అందించే పరిస్థితి నేడు రాష్ట్రంలో అమలులో ఉంది . అంగన్వాడీ కేంద్రంలో బిడ్డల ఆరోగ్యం కోసం బలవర్ధకమైన ఆహారాలు పిల్లలకు, పోషణ అభయాన్, బాలామృతం, ఇస్తున్నారు. ఆయుష్ మాన్ భారత్ పేరుతొ ప్రమాద భీమా పథకం మెడికల్ ఇన్సూరెన్స్ 5లక్షలు కేంద్రంచే అమలు చేస్తున్నారు. విద్యార్థుల కోసం మధ్యాహ్నం భోజనం పథకం, గ్రామాలలో స్మశాన వాటిక అభివృద్ధికి 35లక్షల నిధులు ఇవ్వడం జరిగింది. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నరేంంద్ర మోదీ తనలాగా మిగతా వారు ఇబ్బందులు పడకూడదని ధ్యేయంగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం పథకాలు ప్రతి ఒక్కరు అందుకొనేలా బీజేపీ నడుస్తుంది. భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని 2047కి వికసిత్ భారత్ గా మార్చడానికి నడుం బిగించిన కేంద్రం ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం సంక్షేమం పథకాల ప్రతిఒక్కరికి అందించడానికి ముందుండి నడిపిస్తున్నారు... 40సం. లు దాటినా మహిళలు సర్వేయికల్ క్యాన్సర్ నివారణకు మహిళల కోసం ఉచితం గా మహిళా పథకం అమలు చేస్తున్నారు.. సబకా సాత్ సబ్ కా విశ్వాస్ పేరుతొ కేంద్రం అనేక పథకాలు రాష్ట్రాలలో అమలు చేస్తున్నాము. 47సం. లకాలంలో బీజేపీ పార్టీ దేశం కోసం ఏమి చేసిందో అదే ప్రజలకు చెబుతూ వస్తుంది. గ్రామ గ్రామంలో ప్రజలు బీజేపీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి సౌకర్యాలు చేరే విధంగా కేంద్రం వ్యవస్థను నిర్మించింది గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ అందించేందుకు పెద్ద స్థాయిలో కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు జల జీవన్ మిషన్ ద్వారా గ్రామానికి సుమారు ?1.24 కోట్లు కేటాయించి ట్యాప్ కనెక్షన్లు ఇచ్చామని వివరించారు ఒకప్పుడు బావులు, పంపుల దగ్గర నుంచి నీళు మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు మహిళల కష్టాలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రతి ఇంటికి నీటి సౌకర్యం కల్పించామని అన్నారు నరేంద్ర మోడీ ఆలోచనతో ఈ మార్పులు సాధ్యమయ్యాయని హైలైట్ చేశారు ప్రధాన మంత్రి అవస యోజన కింద గ్రామంలో 174 ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం జరుగుతోందని తెలిపారు పేదలకు సొంత ఇల్లు కల్పించడమే కేంద్ర లక్ష్యమని పేర్కొన్నారు ఆయుష్మాన్ భారత్ ద్వారా గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు అందుతున్నాయని చెప్పారు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా ప్రజలకు వైద్య సదుపాయాలు మెరుగయ్యాయని వివరించారు కోవిడ్ సమయంలో గ్రామంలో 3000 పైగా వ్యాక్సిన్లు అందించామని తెలిపారు పిల్లలకు ఉచిత టీకాలు అందించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు గ్రామ అభివృద్ధే దేశ అభివృద్ధికి పునాది అని మళ్లీ స్పష్టం చేశారు కేంద్ర పథకాల లాభాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని తెలిపారు తాడికొండ బిజెపి మండల అధ్యక్షులు బండ్ల అశోక్ సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి, పనతల సురేష్, సయ్యద్ భాష, తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమాదేవి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంచికల పూడి గంగాధర్ రావు, మండల ప్రధాన కార్యదర్శులు గూడూరు ప్రదీప్, జవ్వాది సురేష్, ఉపాధ్యక్షులు కొణతం శ్రీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట సాంబ శివ రావు, యువ మోర్చా వెంకట కృష్ణ,ఆరుద్ర గోపి, షేక్ బిలాల్, మార్తా నరేంద్ర కంతేటి బ్రహ్మయ్య, వైవి సుబ్బారావు, దర్శనం శ్రీనివాస్, కొత్తూరు వెంకట సుబ్బారావు, యశ్వంత్, ధారా సాంబయ్య, వెలగలేటి గంగాధర్, నడ్డి నాగమల్లేశ్వరి, ఫైరోజే ఖాన్, ఈదర శ్రీనివాస రెడ్డి, పాలపాటి రవికుమార్, తుళ్లూరు మండల అధ్యక్షులు నీరుకొండ లక్ష్మీనారాయణ, మేడుకొండూరు మండల అధ్యక్షులు షేక్ బాషా, చరక కుమార్ గౌడ్, బజరంగ్ రామకృష్ణ దేసు సత్యనారాయణ, హేమ సుందర్, హరిపావని తదితరులు పాల్గొన్నారు..

# గ్యాస్ డీలర్ పై దాడి జరిగితే సరఫరా నిలుపుదల : ఎల్పీజీ డీలర్ అసోసియేషన్

ఇచ్ఛాపురం. పెన్ పవర్, ఏప్రిల్, 06: రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా గ్యాస్ డీలర్ పై దాడి జరిగితే గ్యాస్ సిలిండర్ సరఫరా నిలుపుదల తప్పదు అని ఎల్పీజీ డీలర్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇటీవల ఇచ్ఛాపురం గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి వెంకటేష్ పై అకారణంగా దాడి జరగడం పట్ల యూనియన్ తీవ్రంగా ఖండించింది. సంఘీభావం తెలిపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎల్పీజీ డీలర్ అసోసియేషన్ ప్రతినిధులు బఅందం వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ఆయిల్ కంపెనీలు నిభందనలు ప్రకారమే ఓ టి పి ఉన్నవారికే గ్యాస్ సరఫరా చేస్తున్నాము అని, కొన్ని సాంకేతిక సమస్యలు వల్ల గ్యాస్ బుక్ కాకపోయిన, ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. నిజంగా గ్యాస్ ఏజెన్స్ తప్పు చేస్తే పిర్యాదు లు చెయ్యడానికి అనేక వ్యవస్థలు ఉన్నాయి అని అన్నారు. ఇవన్నీ విడిచిపెట్టి డీలర్ పై భౌతిక దాడులు చేస్తే సహించేది లేదని, ఇలాంటి ఘటనలు పునరావఅతం కాకుండా ప్రజలు కూడా సహకరించాలి అన్నారు. లేదు దాడులు చేస్తాం అంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎల్పీజీ సిలిండర్ సరఫరా నిలుపుదల చెయ్యడానికి వెనుకడమని రాష్ట్ర అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజల వద్దకు.. నేనున్నానంటూ..ఎమ్మెల్యే నసీర్..





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందడుగు వేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు సోమవారం ఉదయాన్నే గుంటూరు తూర్పు నియోజకవర్గం లోని బొంగరాలబీడు, డొంక రోడ్డు తదితర ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి వివరాలు తీసుకున్నారు. ప్రతి రోజూ శానిటేషన్ సిబ్బంది సమయానికి వస్తున్నారా ? ఏదైనా సమస్యలు ఉన్నాయా ? డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా పని చేస్తోందా ? మంచినీటి సరఫరా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో శానిటేషన్ వ్యవస్థలో లోపాలు ఉన్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించాను. అనంతరం విద్యుత్ సరఫరా, స్తంభాల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన ప్రదేశాల్లో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గం లో వందల కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అన్ని ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం చేపడతామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నిత్యం ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

# పేట మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహణ.




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 06: చిలకలూరిపేట: పట్టణ ప్రణాళికలో పార దర్శకతను పెంచడం మరియు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించబడింది.ఆంధ్రప్రదేశ్ పట్టణ మరియు గ్రామీణ ప్రణాళిక సంచాలకులు మరియు గుంటూరు ప్రాంతీయ ఉప సంచాలకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష ఈ ఓపెన్ ఫోరంలో ముఖ్యంగా లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితిగతులు.డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, భవన నిర్మాణ అనుమతుల్లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులు. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ వీటికి సంబంధించిన బాండ్లు మరియు దరఖాస్తుల పరిష్కారం.దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు నేరుగా వివరించగా,వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.అధికారుల ఆదేశాలు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు మాట్లాడుతూ,ప్రజలు సమర్పించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం వేగంగా ప్రాసెస్ చేయాలని, అనవసరమైన జాప్యాన్ని నివారించాలని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు.పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇలాంటి ఫోరమ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి,నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కారం చూపాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ,టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సియర్ వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు , లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్ బిల్డర్లు,టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం అవ్వండి: గాదె







గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 06: ఈరోజు ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అధ్యక్షతన అమరావతి రోడ్డులో ఉన్న ఏ కన్వెన్షన్ లో జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముందుగా ఇటీవల జరిగిన జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో 2024 ఎన్నికల తర్వాత జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలో మరియు మండలాలలో ఉన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. అదేవిధంగా కూటమి లో భాగంగా జనసేన పార్టీ పాత్ర నియోజకవర్గాలలో ఏ విధంగా ఉందో అక్కడ నాయకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాబోయే రోజులలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. మండలాల వారీగా, గ్రామాల వారీగా మీటింగ్లను ఏర్పాటు చేసుకొని ఎన్నికలకు వ్యూహరచన చేయవలసిందిగా సూచించారు. అలాగే త్వరలో మరల నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, మరింత ముందుకు వెళదామని సూచించారు. అలాగే జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో మండల అధ్యక్షులు మరియు డివిజన్ అధ్యక్షుల పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు. స్థానిక నాయకులు చెప్పిన దాని ప్రకారమే తమకు పార్టీ స్థానిక బలమెంతో తెలుస్తుందని, మండలాలలో, గ్రామాలలో మరియు అదేవిధంగా డివిజన్లో ఉన్న నాయకులు అందరూ స్థానికంగా ఉన్న నాయకులతో పాటు ప్రజానీకాన్ని కూడా కలుపుకొని ముందుకు వెళితేనే స్థానిక సంస్థల్లో విజయం సాధించగలమని అన్నారు. అభ్యర్థి ఎంపికలోనే విజయం ఉంటుందని, అభ్యర్థి ఎంపికలో తగు జాగ్రత్తలు పాటించవలసినదిగా సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేన పార్టీ పోటీ చేసే ప్రతి స్థానంలో మనం గెలిచి, జనసేన పార్టీకి అసెంబ్లీ ఎన్నికలలో 100% స్ట్రైక్ రేట్ వచ్చిందో, అదేవిధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా అదే స్ట్రైక్ రైట్ వచ్చే విధంగా మనందరం పనిచేసి పవన్ కళ్యాణ్ కి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీకి కష్టం లో నిలబడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని, కొత్తవాళ్లు పార్టీలోకి రావాలని, అలా వచ్చిన వాళ్ళు కొన్నాళ్లు పార్టీకి సేవ చేసిన తర్వాత మాత్రమే పార్టీ నుండి అవకాశం వస్తుందని తెలియజేశారు. అలాగే జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ చందు సాంబశివరావు మాట్లాడుతూ రాజకీయం సుదీర్ఘ ప్రయాణం అని, ఒక రోజులో ఏది అయిపోదని, ముందుగా మన గ్రామాలలో మన మండలాలలో మరియు మన నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితి ఏంటి అని ఒక అంచనాకు వచ్చి, తదనుగుణంగా మనం మన వ్యూహరచన చేసుకోవలసిన అవసరం ఉందని, దానికి కేడర్ అంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అది ఒకరి వల్ల అయ్యే పని కాదని, అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమల్ మరియు ఇతర నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ విలువలతో ఏర్పడిన పార్టీ అని, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా మనందరం పనిచేసి, పార్టీ నీ మరింత ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. అదేవిధంగా ఈ సమావేశంలో తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని గ్రౌండ్ లెవెల్ లో ఇంప్లిమెంట్ చేసే విధంగా ప్రతి ఒక్కరూ పార్టీకి సహకరించాలని అన్నారు. అలాగే ఈ సర్వసభ్య సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చతోపాటు మరొక రెండు తీర్మానాలను ప్రవేశపెట్టడం జరిగింది. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతి అని పార్లమెంట్ ఉభయ సభలలో ఆమోదం తెలిపిన చట్ట సవరణకు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన సర్వసభ్య సమావేశం.

జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు చందు సాంబశివరావు ప్రవేశపెట్టిన జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వాలు రాష్ట్రంలో 20 లక్షల పైచిలుకు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,65,740 పైచిలుకు సభ్యత్వాలు నమోదు చేసిన సాధక్ లకు, నాయకులకు కార్యకర్తలకు మరియు వీర మహిళలకు అభినందనలు తెలియజేస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే కార్యక్రమం అనంతరం జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ జన్మదినోత్సవ సందర్భంగా అందరూ కలిసి కేక్ కట్ చేయడం జరిగింది.

తదనంతరం ఇటీవల మరణించిన 52వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షులు ఘంటసాల కృష్ణ కౌండిన్య కి సంతాపం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు మరియు నామినేటెడ్ పదవుల్లో వివిధ హోదాలలో ఉన్న నాయకులు అందరూ పాల్గొనడం జరిగింది.

# కరుణించండి కలెక్టర్

## ఎండాకాలంలో నిలువు నీడ లేక సూర్యలంక పర్యాటకులు ఆవేదన. అనాలోచితి నిర్ణయాలతో అవస్థలు పడుతున్న పర్యాటకులు





పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 6: వినటానికి విచిత్రంగా ఉంది బాపట్ల జిల్లా అధికారుల అనాలోచిత నిర్ణయాలు ఎండాకాలంలో నిలువ నీడను ఇచ్చే గొడుగులు బల్లలను ఆపివేయటంతో ఆశ్చర్యపోతున్నారు సూర్యలంక పర్యాటనకు వచ్చిన పర్యాటకులు. ముఖ్యంగా వేసవి తావం నుండి రక్షించేందుకు సూర్యుడి ఎండ నుండి రక్షణ పొందేందుకు నీడ కోసం ప్రత్యేకంగా సూర్యలంక సముద్ర తీరంలో నీడగొడుగులు బల్లలను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే గత కొన్ని రోజుల క్రితం అధికారులు తీసుకున్న అనాలోచితం నిర్ణయాల వల్ల ప్రస్తుతం సూర్యలంక సముద్ర తీరానికి వచ్చే ప్రయాణికులకు నీడ లేక ఎండ వేడి దెబ్బకు అనేక అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక సముద్ర తీర ప్రాంతంలో ప్రతిరోజు అనేకమంది వివిధ ప్రాంతాల నుండి సూర్యలంక సముద్రానికి వస్తూ ఉంటారు అయితే వేసవి కావటంతో ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు సూర్యలంకకు వస్తున్న నేపథ్యంలో అక్కడ అధికారులు తీసుకున్న నిర్ణయాల వల్ల అనేకమంది అవస్థలు పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది గతంలో ఆంధ్రప్రదేశ్ బాపట్ల అడవి పంచాయతీ అనుమతితో సూర్యలంక సముద్రతీరములో ఏర్పాటు చేసిన గొడుగులు నీడ బల్లలు నిలిపివేస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయాల వలన ముఖ్యంగా శని ఆదివారాలలో వేల సంఖ్యలో వస్తున్న పర్యాటకులకు కనీసం నీడ లేక అవస్థలు పడుతున్న పరిస్థితి బాపట్ల సూర్యలంక సముద్ర ప్రాంతంలో స్పష్టంగా కనబడుతుంది. అసలే ఎండాకాలం ఆపైన సుదీర్ఘ ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులకు వడదెబ్బ తగిలి అనుకోని సంఘటన ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులనేది ప్రతి ఒక్కరిలో నెలకొన్న సందేహం దీనిపై అధికారులు వెంటనే స్పందించి వెంటనే నీడ గొడుగులు, బల్లలను పునరుద్ధరణ చేయాలి అని పర్యాటకులు కోరుతున్నారు.

# ముందు బుక్ చేసిన వారికి ముందే సిలిండర్ డెలివరీ చేయాలి..జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ..



గుంటూరు, పెన్ పవర్,ఏప్రిల్,6.. ముందు బుక్ చేసిన వారికి ముందు సిలిండర్ డెలివరీ చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. జిల్లాలో ఎల్.పి.జి సేల్స్ ఆఫీసర్స్, గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లుతో జాయింట్ కలెక్టర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కువ పెండెన్సీ ఉన్న ఏజెన్సీలు అదనపు లోడ్స్ తెప్పించాలని సేల్స్ ఆఫీసర్స్ ను ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీలు ఖచ్చితంగా డోర్ డెలివరీ మాత్రమే చెయ్యాలని, ముందు బుక్‌హాచేసుకున్నవారికి ముందు పంపిణీ చేయు పద్ధతిని పాటించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో డెలివరీ బాయ్స్ ను ఎక్కువ ట్రిప్పులు తిరిగి అధిక సంఖ్యలో పంపిణీ చేయాలని అన్నారు. మార్చి నెలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఐ.వి.ఆర్.ఎస్ సర్వేలో దీపం పథకానికి జిల్లా మొదటి స్థానం సాధించిందని అందరినీ అభినందించారు. ఇకపై కూడా ఇదే పనితీరును కనబరచాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ,హౌతహసీల్దార్లు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో లారీ బీభత్సం: డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ్డ సిమెంట్ లారీ



నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 06: నరసరావుపేట పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో సోమవారం ఒక భారీ ప్రమాదం తప్పిన ఘటన చోటు చేసు కుంది. సిమెంట్ లోడుతో ప్రయాణిస్తున్న లారీ నియంత్రణ కోల్పోయి రోడ్డు మధ్యనున్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ ఒక్కసారిగా బోల్తా పడింది. అయితే, ఈ ప్రమా దంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. ఘటనతో కొంతసేపు రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు అప్రమత్తమై, భారీ ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పసుమర్రు వద్ద రోడ్డు ప్రమాదం బొలెరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 06: చిలకలూరిపేట : మండల పరిధిలోని పసుమర్తి నూతన హైవేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం మార్టూరు నుండి అన్నంబొట్లవారి పాలెం వెళుతున్న బొలెరో వాహనం, ఆర్టీసీ బస్సు పసుమర్తి మలుపు వద్దకు రాగానే ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో నడుపుతున్న మార్టూరుకు చెందిన జాన్ రాజ్ (26) కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని ఆసుపత్రికి తరలించారు.

# తెల్లవారుజామున వెల్లివిరిసిన మానవత్వం

## పదవి ఉన్నా పలకరింపు మరవని నేత
## నిరుపేద కష్టజీవులకు అభయమిచ్చిన ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 06: నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరోసారి తన నిరాడంబరతను, ప్రజా వాత్సల్యాన్ని చాటుకున్నారు. పదవిలో ఉన్నా ప్రతీక్షణం ప్రజల మనిషిగా మెలిగే ఆయన, నేడు తెల్లవారుజామున తన దినచర్యలో భాగంగా ప్రజల కష్టాలను కళ్లారా చూసి స్పందించారు.సోమవారం తెల్లవారుజామున ఎమ్మెల్యే వాకింగ్ చేస్తూ వెళ్తుండగా, రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు కాగితాలను వేరు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కోటయ్య దంపతులు ఆయన దృష్టిలో పడ్డారు. సమాజంలో అత్యంత అట్టడుగున ఉన్న ఆ కష్టజీవుల పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే, వెంటనే వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. లోకమంతా గాఢనిద్రలో ఉన్న వేళ, ఆకలి తీర్చుకోవడం కోసం వారు పడుతున్న శ్రమను చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. వారి కుటుంబ నేపథ్యం, పిల్లల చదువులు మరియు దైనందిన ఇబ్బందుల గురించి ఆ దంపతులతో ముచ్చటించారు. వారి కష్టాలకు చలించిన ఎమ్మెల్యే తక్షణమే ప్రభుత్వం తరఫున రుణ సాయం అందేలా చర్యలు తీసుకుంటానని, వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తానని కొండంత భరోసా ఇచ్చారు. ప్రజల కష్టమే నా కష్టం.. వారి చిరునవ్వులోనే నా సంతోషం అని నమ్మే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, తెల్లవారుజామునే సామాన్య దంపతుల వద్దకు వెళ్లి వారి బాధలను ఆలకించడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అధికారం అంటే ఆజ్ఞలు జారీ చేయడం మాత్రమే కాదు ఆర్తుల కన్నీళ్లు తుడవడం అని ఆయన మరోసారి నిరూపించారు. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని తక్షణం స్పందించే ఇటువంటి ప్రజా నాయకుని పట్ల స్థానికులు మరియు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సాగునీటి రంగంలో నూతన అధ్యాయం

## నరసరావుపేటలో ఘనంగా ప్రారంభమైన నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత 90 రోజుల ప్రత్యేక కార్యక్రమం
## ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం
## కత్తవ వాగు వద్ద అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 06: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటి సంరక్షణ మరియు సాగునీటి వనరుల పునరుద్ధరణే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత అనే 90 రోజుల ప్రత్యేక కార్యక్రమం సోమవారం నరసరావుపేట నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభమైంది. నరసరావుపేట – సత్తెనపల్లి రోడ్డులోని కత్తవ వాగు వద్ద జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కత్తవ వాగు వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం క్షేత్రస్థాయిలో వాగు పరిస్థితిని పరిశీలించి, పూడికతీత మరియు కాలువల అనుసంధానానికి అవసరమైన ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 6 నుండి జూలై 5, 2026 వరకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రకటించారని తెలిపారు. సాగునీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం ప్రభుత్వంపైనే కాకుండా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా సాగునీటి సంఘాలు క్రియాశీలకంగా వ్యవహరించి, నీటి వృధాను అరికట్టాలని మరియు కాలువల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమం పనుల గుర్తింపు (10 రోజులు), నిధుల మంజూరు (5 రోజులు), పనుల అమలు (70 రోజులు), మరియు రిపోర్టింగ్ (5 రోజులు) అనే నాలుగు దశల్లో అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. ఎమ్మెల్యే స్థానిక మహిళా మరియు పురుష రైతులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి సాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డిఓ, ఎంపీడీఓలు, తహసీల్దార్లు మరియు నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు సజావుగా జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో జల వనరుల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, మండల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రథమ ప్రాధాన్యత, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 06: నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించి వారికి అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. సోమవారం నరసరావుపేటలోని పార్టీ కార్యాలయం నందు ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు మరియు పట్టణ వార్డుల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా వినతులను స్వీకరించారు. ప్రధానంగా పింఛన్లు, రేషన్ కార్డులు, డ్రైనేజీ సమస్యలు, సాగునీటి సరఫరా మరియు రోడ్ల మరమ్మతులపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బాధితుల సమస్యలను సావధానంగా విన్న ఆయన అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో నా వద్దకు వస్తున్నారు, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి సమస్యను పరిష్కరించే వరకు నిరంతరం శ్రమిస్తానన్నారు. కార్యాలయం తలుపులు ఎప్పుడూ సామాన్య ప్రజల కోసం తెరిచే ఉంటాయి, అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ పై దండయాత్ర 2.0..పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మి శా..







విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 06:ఎన్. టి. ఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ మరియు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జీరో టాలరెన్స్ టూ డ్రగ్స్ అనే నినాధంతో యువతను డ్రగ్స్ ముప్పు నుండి దూరం చేయడం మరియు సమాజాన్ని మత్తు పదార్థాల నుండి పూర్తిగా దూరం చేయడమే లక్ష్యంగా 34 రోజులపాటు 550 కిలో మీటర్ల 5 గురు మహిళా సిబ్బంది సైకిల్ యాత్ర చేస్తూ ప్రజల్లో డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించడం జరిగింది. ఈ నేపధ్యంలో అవగాహన తరువాత కార్యాచరణలో బాగంగా పరీక్ష చేద్దాం – మత్తును వదిలిద్దాం అనే నినాధంతో ఈ డ్రగ్స్ పై దండయాత్ర 2.0 కర్యక్రమాన్ని ఈ రోజు నున్న పోలీస్ స్టేషన్ పరిదిలోని వాంబే కాలనీ నందు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మి శా , మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ , డి.సి.పి.లు శ్రీకృష్ణ కాంత్ పటేల్ , షిరీన్ బేగం , కె.తిరుమలేశ్వర రెడ్డి , కె.జి.వి. సరిత , బి.లక్ష్మి నారాయాణ , కృష్ణ ప్రసన్న .ఎస్.వి.డి.ప్రసాద్ , డ్రగ్ కంట్రోల్ ఏ. డి. శ్రీ రామ మూర్తి , డి. ఎం.హెచ్.ఓ సుధారాణి , ఏ.డి.సి.పి.లు. జి రామకృష్ణ , ఎం.బి.ఎం.మురళి కృష్ణ , ఏ.సి.పి.లు, ఇన్స్పెక్టర్లు, స్వచ్ఛంద సంస్థలు, ఫోరం ఫర్ చైల్డ్ కోఆర్డినేటర్ ఆరవ రమేష్ , సిబ్బంది మరియు యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.....35 రోజులు డ్రగ్స్ పై దండయాత్ర చేయడం జరిగింది. ఈ యాత్రలో మూడు లక్షల మంది డ్రగ్స్ తీసుకోము అని డిజిటల్ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ యాత్ర ప్రజలపై మంచి ప్రభావం చూపింది, డ్రగ్స్ పై దండయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం చూపింది, ముఖ్యంగా యువతకు డ్రగ్స్ పై అవగాహన కలిగి , డ్రగ్స్ వాడడం వలన ఎటువంటి దుష్పరిణామాలు చోటు చేసుకుంటాయో తెలియజేయడం జరిగింది. ఈ క్రమంలో పోలీస్ కమిషనరేట్ పరిదిలో 149 హాట్ స్పాట్స్ లను గుర్తించడం జరిగింది. ఈ 149 హాట్ స్పాట్స్ లలో 30 రోజుల పాటు 3000 డ్రగ్స్ టెస్ట్ కిట్స్ ద్వారా రోజుకు 100 మంది చొప్పున అనుమానితులకు డ్రగ్స్ టెస్ట్ చేయడం జరుగుతుంది, స్వచ్ఛందంగా వచ్చి తనిఖీ చేసుకున్న వారిలో పాజిటివ్ వస్తే వారిని అడిక్షన్ సెంటర్ కు తరలించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేయడం జరిగింది. అందులో 20 మంది పోలీస్ సిబ్బంది మరియు 10 మంది హెల్త్ డిపార్ట్మెంట్ వారు ఒక బృందంగా ఏర్పడి 149 హాట్ స్పాట్ లలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించి తనికీలను చేయడం జరుగుతుంది. ఇప్పటికే నగరం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది, 149 హాట్ స్పాట్స్ లలో ఫర్స్ సిస్టమ్ అందుబాటులోకి తీసుకురావడంపై సమాలోచనలు చేస్తున్నాం, 149 హాట్ స్పాట్స్ లలో అవగాహన కల్పించడం జరుగుతుంది, ఈ ప్రదేశాలలో లైటింగ్ ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నిరంతరం పర్యవేక్షణ కోసం డ్రోన్ లను వినియోగించడం జరుగుతుంది. డ్రగ్స్ నివారణకు వెనుకడుగు వేయడం ఉండదు, రౌడీ షీటర్స్,సస్పెక్ట్ షీటర్స్ ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉండాలి, ఓపెన్ డ్రింకింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం, డ్రగ్స్ రహిత కమీషనరేట్ చేయడమే ధ్యేయంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జూన్ జులై నెలలో డ్రగ్స్ పై దండయాత్ర 3.0 కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రతి కళాశాలలో విద్యార్థులకు మరియు యువతకు ప్రతి ఒక్కరికీ తనిఖీ చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఇప్పటికే గంజాయి విక్రయిస్తూ నేరాలకు పాల్పడుతున్న 25 మందిపై పిట్ ఎన్. డి. పి. ఎస్. అమలు చేయడం జరిగింది. మరో 20 మందిపై ప్రపోజల్స్ లను పంపడం జరిగింది. త్వరలో వారిపై కూడా అమలు చేయడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. :

ఎన్టీఆర్ జిల్లాలో డ్రగ్స్ పై సైకిల్ యాత్ర మంచి ప్రభావం చూపింది, ఇప్పటి వరకు ప్రేమతో చెప్పి చూసాం...మార్పు రాకపోతే దండిస్తాం, డ్రగ్స్ మహమ్మారి ఒక వ్యక్తి పై మాత్రమే కాదు...కుటుంబం పై తీవ్ర ప్రభావం చూపుతుంది, డ్రగ్స్ రహిత జిల్లానే ధ్యేయంగా యంత్రాంగం పనిచేస్తుంది. ఎవరైనా సమాజం కోసం డ్రగ్స్ పై దండయాత్ర 2.0 కార్యక్రమంలో బాగస్వాములు అయిన వారిని పి.4 కార్యక్రమంలో బాగస్వాములుగా గుర్తించి వారికి సర్టిఫికెట్ లను కూడా అంధించడం జరుగుతుంది అని తెలిపినారు.

# నరసరావుపేటలో ఘనంగా భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం



నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 6: పల్నాడు జిల్లా నరసరావుపేటలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక పెద్ద చెరువు పదవ లైన్ నందు బిజెపి రెండో పట్టణ అధ్యక్షుడు అడపా ఫణిభూషణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమ విశేషాలు: జెండా ఆవిష్కరణ: ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి, భారత్ మాతా కీ జై అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు ముఖ్య అతిథి: బిజెపి సీనియర్ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి ఎదిగిన తీరును కొనియాడారు. క్రమశిక్షణ, దేశభక్తి, మరియు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పార్టీ సిద్ధాంతాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జైహో అమరావతి, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

## అమరావతికి చట్టబద్ధత కల్పించిన కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు
## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట పెన్ పవర్ ఏప్రిల్ 06: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, అలాగే వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు నరసరావుపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం (ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ, రిజిస్టర్ నెం. 325/1968) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ మరియు కూలింగ్ వాటర్ పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని శివుని బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా ప్రజలకు మజ్జిగను అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఆకర్షణగా నిలిచింది. జైహో అమరావతి – జయ జయహో అమరావతి అనే నినాదంతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో అభివృద్ధి బాటలో పయనిస్తున్న అమరావతి రాజధాని మరియు నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్న తమ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కి మరియు కూటమి ప్రభుత్వం నాయకులకు పట్టణ ఆర్యవైశ్య సంఘం తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఆర్యవైశ్య సంఘం వారు ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. సమాజ సేవలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని, బాటసారుల కోసం మజ్జిగ మరియు చల్లని నీరు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. రాజధాని అమరావతి పట్ల వారు చూపుతున్న ప్రేమను కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, ప్రతినిధులు, సభ్యులు, కూటమి ప్రభుత్వ నాయకులు మరియు స్థానిక కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# విదేశాల్లో పర్యటన చేస్తే. అంతరాలయాల్లో పూజలు నిషేధం

**విజయవాడ, ఏప్రిల్ 5, పెన్ పవర్:** విదేశీ పర్యటనలు చేసి వచ్చిన అర్చకులు దేవాలయాల్లోని ప్రధాన గర్భాలయాల్లోకి ప్రవేశించి పూజలు నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ శాఖ (ధార్మిక పరిషత్), శృంగేరి శారదా పీఠం గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ నిబంధనల ప్రకారం, విదేశాలకు వెళ్లొచ్చిన అర్చకులు గర్భాలయంలోకి ప్రవేశించడానికి వీలులేదని, ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్‌పై ఉందని ఏపీ కోర్టు పేర్కొంది. విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి చెందిన శ్రీచక్ర నవావరణ అర్చన పారాయణదారు డీఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం సోమయాజి దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. 2010లో దేవాదాయ శాఖ జారీ చేసిన సర్క్యులర్, అలాగే 2024 డిసెంబరులో శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీ భారతీతీర్థ స్వామి వారు విడుదల చేసిన ప్రామాణికమైన మార్గదర్శకాలను ఆలయాల్లో పాటించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కేఆర్ శ్రీనివాస్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటన చేసిన వారిని గర్భాలయ పూజలకు అనుమతించడం ఆచార విరుద్ధమని వాదించారు. శృంగేరి శారదా పీఠం జగద్గురువులు మహాతీర్థ భారతీస్వామి నిబంధనల ప్రకారం, అర్చకులు విదేశాలకు వెళ్లడంపై ఆంక్షలు ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా వెళ్లాల్సి వస్తే, వారు తిరిగి వచ్చిన తర్వాత కేవలం ఆలయం వెలుపల జరిగే పూజలు, వ్రతాలకు మాత్రమే పరిమితం అవుతారు. గర్భాలయంలో పూజలు

నిర్వహించే వారు ఖచ్చితంగా త్రికాల సంధ్యావందనం, వేద అధ్యయనం, ఆహార నియమాలతో పాటు కఠిన ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటించాలని శారదా పీఠం గతంలోనే స్పష్టం చేసింది. అదే నిబంధనలు చాలా చోట్ల అమలవుతున్నాయి. విదేశాలకు వెళ్లిన వారు లేదా సంప్రదాయాలకు విరుద్ధంగా జుట్టు కత్తిరించుకున్న వారు (క్షవరం చేయించుకున్న వారు) గర్భాలయ ప్రవేశానికి అనర్హులని కోర్టు గుర్తు చేసింది. ఈ నిబంధనలను తప్పకుండా పాటిస్తామని దేవాదాయ శాఖ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు




## ఆ ఐదుగురు హిట్ లిస్టే...

**గుంటూరు, ఏప్రిల్ 5,పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంగా చెప్పేశారు. తరచూ వివాదాల్లో ఇరుక్కునే ఎమ్మెల్యేలు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే మిగిలిపోతారని చెప్పారు. అంటే ఎమ్మెల్యేలకు స్పష్టంగా చెప్పేశారు. ఏమాత్రం వివాదాల్లో ఇరుక్కున్నా తాను టిక్కెట్ ఇచ్చేది లేదని ఆయన చెప్పకనే చెప్పారు. ఇప్పటికిప్పుడు చర్యలు ఉండకపోవచ్చు. కానీ భవిష్యత్ లో మాత్రం వారికి టిక్కెట్ ఇచ్చే విషయంలో ఈ వివాదాలన్నీ కౌంట్ అవుతాయని చంద్రబాబు ఎమ్మెల్యేలకు చెప్పకనే చెప్పేశారు. ఎన్ని సార్లు చెప్పినప్పటికీ వారు చెవికెక్కించుకోకపోవడంతో పాటు ఇంకా ఎమ్మెల్యేలు రెచ్చిపోతుండటంతో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు. ఇటీవల టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు వరస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. అనేక మంది అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇప్పటి వరకూ చాలా మంది ఎమ్మెల్యేలు గీత దాటినట్లు చంద్రబాబుకు స్పష్టంగా అర్థమయింది. వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ అయితే తీసుకున్నారు కానీ, సస్పెండ్ చేయలేదు. సస్పెండ్ చేయకపోనంత మాత్రాన చేతకాని తనం అని చూస్తూ ఊరుకోవద్దని అన్నారు. గీత దాటితే ఖచ్చితంగా సస్పెండ్ చేస్తామని చెప్పారు. అలాగే వైఖరి కొనసాగితే సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని హింట్ ఇచ్చారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్, నరసరావు పేట ఎమ్మెల్యే అరవింద బాబు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం లుమాత్రం ట్రబుల్ లో ఉన్నట్లేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వెను వెంటనే వీరిపై చర్యలు తీసుకోకపోయినప్పటికీ వచ్చే ఎన్నికల్లో వీరి స్థానంలో కొత్త నేతలకు అవకాశం ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయినట్లు తెలిసింది. ఎవరు తోక జాడించినా.. ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం లేదు కానీ, వచ్చే ఎన్నికల్లో మాత్రం టిక్కెట్ లభించదన్నది స్పష్టంగా చంద్రబాబు చెప్పినట్లయింది. ఇప్పటికైనా ఎమ్మెల్యేల్లో మార్పు వస్తుందా? లేదా?అన్నది చూడాల్సి ఉంది.

**కాఫీ కబుర్లతో ఆకట్టుకుంటున్నలోకేష్**

కాఫీ కబుర్లు- పేరుతో టిడిపి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోంది. టిడిపి కేంద్ర కార్యాలయంలో గత కొన్ని రోజులుగా పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలకు, అదే విధంగా క్లస్టర్ ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి.. ప్రత్యర్థుల పై ఏ విధంగా పై చేయి సాధించాలి... అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లే విషయంపై తర్ఫీదు ఇస్తున్నారు. చంద్రబాబు సహా మంత్రి లోకేష్ తీసుకువస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లే అంశాలపై ఏ విధంగా ప్రచారం చేయాలని అంశాలను వారికి వివరిస్తున్నారు. తద్వారా వచ్చే ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీని గెలుపు గుర్రం ఎక్కించడమే లక్ష్యంగా ఈ శిక్షణ జరుగుతోంది. దీనిలో భాగంగా -కాఫీ కబుర్లు- అనే పేరుతో వినూత్న కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నారు.. దీనిని ప్రధానంగా ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు, అదేవిధంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో నారా లోకేష్ రెండుసార్లు పార్టీ కార్యాలయానికి వచ్చారు. చంద్రబాబు సైతం రెండుసార్లు పార్టీ ఆఫీస్ కి వచ్చారు. ఈ సందర్భంగా -కాఫీ కబుర్లు- పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు, పార్టీలో నాయకులకు -కార్యకర్తలకు మధ్య ఉన్న రిలేషన్ అడిగి తెలుసుకుంటున్నారు. ఏవిధంగా ముందుకు సాగాలి. ఉన్నత స్థాయి ప్రజల నుంచి క్షేత్రస్థాయిలో సాధారణ ప్రజల వరకు పార్టీని ఏ విధంగా ముందుకు నడిపించాలనే అంశంపై వారు చర్చిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చిత్రమైన విషయం ఏమిటంటే అందరితోపాటు కూర్చుని కాఫీ తాగుతూ వారితో ముచ్చటించడం. ఎవరు ఏం చెప్పినా వినే అవకాశం ఇవ్వడం... ప్రధానంగా కార్యకర్తలను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో వ్యక్తిగత అంశాలకు కూడా ప్రాధాన్య ఇస్తున్నారు. కొంతమంది కార్యకర్తలు తమ కుటుంబాలకు సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావిస్తుంటే ఓపికగా వింటున్నారు. పార్టీ పరంగా అయితే వారు చెప్పింది వింటూనే మరికొన్ని సలహాలు సూచనలు ఇస్తున్నారు. మొత్తంగా -కాఫీ కబుర్లు- కార్యక్రమం టిడిపిలో ఒక ఆసక్తికర పరిణామంగా మారింది. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం పట్ల ఆసక్తి నెలకొంది. ఈ తరహా కార్యక్రమం నిర్వహించడం టిడిపికి ఇదే తొలిసారి. గతంలో బిజెపి -చాయ్ పే చర్చా- వంటి కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. అదే తరహాలో టిడిపి కాఫీ కబుర్లు పేరుతో కార్యక్రమాన్ని ఎంచుకుని నిర్వహించడం ద్వారా కార్యకర్తలకు మరింత చేరువ అయ్యేలా వ్యవహరిస్తోంది.

## టీడీపీకి మరింత మంది మహిళా లీడర్లు...

**కాకినాడ, ఏప్రిల్ 5, పెన్ పవర్:** టీడిపికి మరింత మంది మహిళలు అవసరం అవుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం పార్టీలో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు పార్టీ అధినేత సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే ఏర్పాటు చేయనున్న రాష్ట్రస్థాయి కమిటీలో మహిళల రిజర్వేషన్ పెంచాలని భావిస్తున్నారు. తద్వారా 33% మేరకు పార్టీ పదవుల్లో ముఖ్యంగా రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళలకు అవకాశం దొరుకుతుంది. ఇది ఒక రకంగా పార్టీ ఆవిర్భావం తర్వాత సంచలన నిర్ణయం అనే చెప్పాలి. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళా నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ఇప్పుడు 33 శాతం మందిని ఖచ్చితంగా నియమించాలని పార్టీ నిర్ణయించింది. తద్వారా మెజారిటీ మహిళ నాయకులకు రాష్ట్రస్థాయి కమిటీలో అవకాశం దొరుకుతుంది. మరోవైపు నియోజకవర్గాల సంఖ్య పెరిగితే.. మహిళా నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కూడా మరింత మంది మహిళ నాయకులు అవసరం ఏర్పడుతుంది. దాదాపు 80 నియోజకవర్గాలపైగా మహిళలకు కేటాయిస్తారన్న చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఆమేరకు మహిళా నాయకత్వాన్ని పెంచుకునేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. దీనికి ప్రధానంగా రెండు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని సమాచారం. 1) సంస్థా గతంగా పార్టీలో ఉన్న మహిళా నాయకులు. అదేవిధంగా వారసత్వంగా పార్టీకి సేవ చేస్తున్న నేతలు. 2) యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో పార్టీ వేస్తున్న అడుగులు, తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ఆకర్షితులవుతున్న యువతులను పార్టీలోకి తీసుకుని వారికి పదవులు కట్టబెట్టాలని భావిస్తోంది, అయిన ప్పటికీ నాయకత్వం పరంగా చూసుకున్నప్పుడు మహిళల సంఖ్య తక్కువగా ఉంది. ఈ క్రమంలో మహిళా నాయకత్వాన్ని పెంచుకునే దిశగా ఏ విధంగా ముందుకు సాగాలి.. ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలి.. అనే విషయంపై చంద్రబాబు పార్టీ సీనియర్లకు బాధ్యతలు అప్పగించారు. ఎవరిని పడితే వారిని కాకుండా పార్టీకి సంస్థగతంగా ఉండేలాగా సామాజిక వర్గాలపరంగా అదే విధంగా బడుగు బలహీనవర్గాల నుంచి కూడా మహిళా నాయకులను తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో బీసీలు ఎక్కువ మంది ఉండేలా చూడనున్నారు. ఎందుకంటే ఆది నుంచి టిడిపి బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో వారి తరఫున బలమైన గళం వినిపించే మహిళా నాయకులకు ఇప్పుడు అవకాశం దక్కనుంది. మొత్తంగా టిడిపికి మరింత మంది మహిళా నాయకుల అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

రాయపాటి అరుణకు చాన్స్

రాజధాని అమరావతి ఉద్యమకారిణిగా గుర్తింపు సాధించి కూటమి ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన రాయపాటి శైలజ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయనున్నారా? ఆమెను పార్టీలో చేర్చుకుని రాజధాని ప్రాంతంలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీకి నిలపాలని టీడీపీ అధిష్టానం భావిస్తోందా? ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తే ఈ అనుమానాలు నిజమయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారని, దీంతో కొత్తగా సమర్థులైన మహిళా నేతలను రంగంలోకి దింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని అంటున్నారు. రాజకీయ నేపథ్యం నుంచి వచ్చినప్పటికి రాయపాటి శైలజకు ఇప్పటివరకు ఏ పార్టీతో సంబంధం లేదని అంటున్నారు. గతంలో అమరావతి రాజధానిని కాపాడుకునేందుకు రైతులు చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపిన శైలజ టీడీపీ అధిష్టానం దృష్టిని ఆకర్షించారని చెబుతున్నారు. ఆమె కుటుంబానికి టీడీపీతో అనుబంధం ఉన్నప్పటికీ శైలజ మాత్రం ఆ పార్టీ తరఫున ఇప్పటివరకు పనిచేయలేదని, కేవలం అమరావతి ఉద్యమం వరకు పరిమితమయ్యారని అంటున్నారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాజధాని ఉద్యమం కూడా ఒక కారణంగా భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పట్లో ఉద్యమంలో ముందుండి నడిపిన రాయపాటి శైలజ తెగువను మెచ్చుకుని మహిళా కమిషన్ గా నియమించారు. ఇక ఇప్పుడు కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు అవుతుండటం, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాల్సివుండటంతో రాయపాటి శైలజను పార్టీలోకి తీసుకువచ్చి ఆమె సేవలను రాజకీయంగా వాడుకోవాలని టీడీపీ హైకమాండ్ భావిస్తోందని అంటున్నారు. ప్రస్తుతం మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా ఉన్న రాయపాటి శైలజ పదవీకాలం రెండేళ్లు మాత్రమే ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే సగం పదవీకాలం పూర్తికావడంతో మిగిలిన సమయం ముగిసిన తర్వాత రాయపాటి శైలజను ఏదో ఒక నియోజకవర్గానికి ఇంచార్జిగా నియమించాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. సామాజికంగా ఆర్థికంగా కూడా ఆమె బలంగా ఉండటంతో ఏ స్థానం అప్పగించాలనే విషయమై టీడీపీ హైకమాండ్ తర్జనభర్జన పడుతోందని అంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు నియోజకవర్గాలను పరిశీలిస్తున్నారని, అదేవిధంగా కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలు, మహిళా రిజర్వేషన్ కు అవకాశం ఉండే స్థానాలను పరిశీలిస్తున్నారని అంటున్నారు.

# 'మావిగన్' ట్రెండింగ్...

**విజయవాడ, ఏప్రిల్ 5, పెన్ పవర్:** సోషల్ మీడియాలో ప్రతీ రోజూ చాలా ట్రెండ్ అవుతుంటాయి. అలా ఫేమస్ అయిన పదాలు, క్రైమ్ స్టోరీస్, రియల్ సంఘటనలను మూవీస్‌గా తెరకెక్కించడం మనం చూశాం. కొన్నింటిని సాంగ్ లిరిక్స్‌లోనూ వాడుతుంటారు. గతంలో చాలా వరకూ అలాంటి ట్రెండింగ్ వర్డ్స్ సినిమాలుగా వచ్చాయి. తాజాగా అలాంటి రీసెంట్ వర్డ్‌ను మూవీ టైటిల్‌గా రిజిస్టర్ చేయించినట్లు ప్రచారం సాగుతోంది. గత రెండు రోజులుగా ఏ నోట విన్నా, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మావిగన్ పేరే వినిపిస్తోంది. ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజా ప్రెస్ మీట్‌లో ఈ కొత్త పదాన్ని ఇంట్రడ్యూస్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన సందర్భంగా... ఆయన ప్రెస్ మీట్ పెట్టారు. ఈ బిల్లును వైసీపీ ఎంపీలు వ్యతిరేకించారు. ఈ క్రమంలో జగన్ ప్రెస్ మీట్‌లో మచిలీపట్నం - విజయవాడ - గుంటూరు ప్రాంతాలను కలుపుతూ రాజధాని ఏర్పాటు చేయాలంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. మచిలీపట్నంలో హీూ, విజయవాడలో ఎ×, గుంటూరులో +ఖచీను తీసుకుని మావిగన్ అని పేరు పెట్టాలని సూచించారు. ఈ పేరు నచ్చకపోతే అమరావతి పేరుతోనే ఆ ప్రాంతాన్ని కాపిటల్‌గా చేయాలని అన్నారు. దీంతో ఆ పేరు మార్మోగుతోంది. మావిగన్ ప్రతిపాదనపై జగన్ సపోర్టర్స్ ఆయనకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే... కొందరు వైసీపీ అధినేతపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు సైతం భవిష్యత్తులో మావిగన్ రాజధాని అవుతుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలా ఈ పదం వైరల్ అయ్యింది. ఈ క్రమంలో పేరుతో టాలీవుడ్ ప్రొడ్యూసర్ ఫిలిం ఛాంబర్‌లో టైటిల్ రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఈ పేరుతో మూవీ తీయబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో నిజా నిజాలు తెలియాల్సి ఉంది. మరి పేరుతో ఎలాంటి జానర్ మూవీ తీస్తారో అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. పొలిటికల్ జానర్ అయితే బెటర్ అంటూ సలహాలు ఇస్తున్నారు.

ఆచరణలో ఎపుడయ్యేన్ ?

ఏపీలో ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఒక ప్రతిపాదన అమరావతి రాజధానికి ఆల్టర్నేషన్ గా చేసింది. దానిని ప్లాన్ బీగా చెప్పుకుంటోంది. దానికి మావిగన్ అని పేరు కూడా పెట్టారు. అయితే ప్రత్యర్థులతో పాటు విమర్శలు బుద్ధి జీవులు అంతా అది మావిగన్ కాదు ఎండమావిగన్ అని అంటున్నారు. ఎందుకంటే ఈ ప్రతిపాదన చాలా ఆలస్యంగా వచ్చింది. అంతే కాదు ఇపుడు ఏపీలో ఉన్న పరిస్థితుల్లో దీని సాధ్యాసాధ్యాలు






పరిశీలించిన వారు అయ్యేది ఉండదని అంటున్నారు.. అది ఆచరణలో అయ్యేనా అంటే కాదనే చెబుతారు. ఎందుకంటే అమరావతికి ఇపుడు చట్ట బద్ధత అనే రాజ్యాంగ భద్రత ఉంది. అంతే కాదు న్యాయపరమైన రక్షణ కూడా ఉంది. అమరావతి రాజధానిగా ఏపీకి నిర్ణయిస్తూ పార్లమెంట్ ఆమోదించింది. రాష్ట్రపతి రాజ ముద్రతో ఇక రావడమే ఆలస్యం. అది కూడా జరిగి తీరుతుంది. అలాంటి అమరావతిని కదపడం సాధ్యమా అంటే అసాధ్యం అని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు: ఇక రేపటి రోజున ఏపీలో వైసీపీ అధికారం చేపడితే అమరావతికి బదులుగా మావిగన్ అంటూ రాజధాని మార్పు చేయడం సాధ్యమేనా అంటే కాదనే చెబుతారు. ఎలా అంటే పార్లమెంట్ లో మెజారిటీ సభ్యులు విభజన చట్టంలోని సవరణను ఆమోదించాలి. నిన్న అంతా చూశారు, అధికార బీజేపీ విపక్ష కాంగ్రెస్ సహా దేశంలోని అన్ని పార్టీలు అమరావతికి జై కొట్టాయి. మళ్లీ అమరావతి కాదు మావిగన్ పేరుని చేర్చాలని అంటే మాత్రం వారు ఎందుకు అంగీకరిస్తారు. పైగా అక్కడ అప్పటికి ఎంతో కొంత నిర్మాణాలు జరుగుతాయి కదా ఆ భూములను ఏమి చేస్తారని ప్రశ్నించకుండా ఉండరు కదా అని మేధావులు అంటున్నారు. ఇక 2019లో అయితే అమరావతిలో ఏమీ వర్క్ జరగలేదు కాబట్టి వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులు అని ప్రతిపాదించగలిగింది. అయినా సరే న్యాయ స్థానాలలో అది వీగిపోయింది. కానీ ఎంత కాదనున్నా 2029 నాటికి అమరావతి రాజధానికో కీలక ప్రభుత్వ భవనాల నిర్మాణం జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన భూములలో నిర్మాణాలు జరిగితే యాక్టివిటీ స్టార్ట్ అవుతుంది. కానీ ఆ విషయం ఎవరూ చెప్పలేరు కానీ కూటమి ప్రభుత్వం అయితే పట్టుదలగా ఉంది కాబట్టి ఈ విషయంలో కొంత మేర ప్రగతి కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా ముందుకు సాగుతారు తప్ప వెనక్కి వెళ్ళేది ఉండదు, దాంతో రేపటి రోజున వైసీపీకి అధికారం దఖలు పడి ఆ పార్టీ ఎంపీల మద్దతు కేంద్రానికి అవసరం అయినా ఈ విషయంలో మాత్రం కేంద్రం నుంచి సాయం చేసేది ఉండదు, పైగా ఒక చోట రాజధాని అనుకుని కొంత పనులు చేసి మళ్ళీ మారుస్తామంటే జనాలు కూడా నెగిటివ్ అవుతారు అన్నది అంతా గుర్తుంచుకోవాల్సి ఉంది. అయితే వైసీపీ అధికారంలోకి వస్తే మాత్రం మావిగన్ పేరుతో విజయవాడ గుంటూరు, మచిలీపట్నమలో కొంత మేర అభివృద్ధి చేయవచ్చు. లేదా ఇంకా ముచ్చట పడితే సీఎం ఆఫీసు కూడా అక్కడ నుంచి నడపవచ్చు కానీ అమరావతి రాజధాని మాత్రం అలాగే చట్టబద్ధతతో ఉంటుంది. పైగా అమరావతిలోనే అన్ని ప్రభుత్వ ఆఫీసులు ఉంటే వేరే చోట నుంచి పాలన జరిపించడం కూడా ఆచరణలో అంత సహేతుకం అనిపించుకోదు. ఏది ఏమైనా మావిగన్ అన్నది ఎండమావిగా మారుతుందా అన్న చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# అమరావతి మార్పు సాధ్యమా...



**ఒంగోలు, ఏప్రిల్ 5, పెన్ పవర్:** అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. అందుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందింది. త్వరలో రాష్ట్రపతి సంతకం చేసి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అయితే దీనిపై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆ బిల్లును మార్చేస్తాం అంటూ కామెంట్స్ చేశారు. ఇప్పుడు బిల్లు పెట్టిన మాదిరిగానే.. తాము చేస్తాం అంటూ చెప్పుకొచ్చారు. అప్పటినుంచి ఆయనకు అనుకూలురు సైతం అదే తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే అది సాధ్యమేనా అన్న ప్రశ్నకు కొంతమంది విశ్లేషకుల ముసుగులో సాధ్యమే అని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. అది ప్రజలతో ముడిపడే విషయం కాగా.. మరోవైపు కోర్టు పరిధిలో కూడా ఉంది. ఈ విషయం తెలియక చాలామంది విశ్లేషణల రూపంలో ప్రజల్లో అయోమయాన్ని సృష్టిస్తున్నారు. అమరావతి మార్పు విషయంలో జగన్మోహన్ రెడ్డి చెబుతున్న మాటలను పరిగణలోకి తీసుకుంటే.. ముందుగా ఆయన అంతులేని విజయం సాధించాలి. ఆయనకు అనుకూలమైన ప్రభుత్వం కేంద్రంలో రావాలి. అప్పుడే ఆ బిల్లు మరోసారి మార్పునకు కొంతవరకు అవకాశం ఉంటుంది. అయితే అప్పుడు కూడా అది రాజకీయ అంశంగా మారనుంది. ఎందుకంటే అప్పటికి అమరావతికి ఒక రూపం వస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరుగుతుంది. వాటిని మారిస్తే మాత్రం ప్రజావ్యతిరేకత రావడం ఖాయం. ఎందుకంటే ఏ రాష్ట్రం కూడా రాజధానిని మార్పు చేస్తున్న దాఖలాలు లేవు. కానీ జగన్మోహన్ రెడ్డి పదేపదే రాజధానులను మారిస్తే ప్రజలు ఊరుకోరు. రాజకీయాలు విపరీతంగా ప్రభావితం అవుతాయి కూడా. జాతీయస్థాయిలో జగన్మోహన్ రెడ్డి నవ్వుల పాలవుతారు కూడా. ప్రస్తుతం జగన్ వైఖరి చూస్తుంటే మారుస్తాం అని చెప్పడం లేదు. కేవలం అమరావతి విషయంలో దూకుడుగా ప్రభుత్వం ముందుకెళ్తున్న వేళ.. కొంత రాజకీయ అయోమయం సృష్టించేందుకే ఈ ఎత్తుగడ అని స్పష్టం అవుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో తిరుగులేని విజయం సాధించింది. అప్పుడే అమరావతి స్థానంలో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. కానీ అప్పటికే ఏపీ రాజధాని అమరావతి అని రికార్డుల్లో నమోదయింది. ఆయన మూడు రాజధానుల ప్రయత్నం చేస్తున్న సమయంలోను కేంద్ర ప్రభుత్వ రికార్డుల ప్రకారం అమరావతి రాజధాని అని తేలిపోయింది. మరి అంతటి బలంలో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ఒప్పించలేకపోయారు. పాలన వికేంద్రీకరణ కోసమే తాను మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నానని చెప్పలేకపోయారు. ఎందుకంటే అప్పుడు 22 మంది పార్లమెంట్ సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్నారు. తనకు విలువనిచ్చే ఎన్ డి ఏ ప్రభుత్వం ఉంది. పైగా తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబుకు కేంద్ర పెద్దలు వ్యతిరేకంగా ఉన్నారు. ఆ సమయంలోనే తాను పట్టుబడి తెరపైకి తెచ్చిన మూడు రాజధానులను అమలు చేయలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. మరోవైపు న్యాయ చిక్కులను కూడా అధిగమించలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తీసుకున్నప్పుడు ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించారు అమరావతి రైతులు. వారిని ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టారు. కేసులతో ఉక్కిరి బిక్కిరి చేశారు. రాజధాని అంటే ఆ 29 గ్రామాలకు సంబంధించిన అంశంగా భావించారు. కానీ అమరావతి రైతులు న్యాయ పోరాటం చేశారు. ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు డివిజనల్ బెంచ్ అమరావతి రైతులకు అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో ఇష్టపడని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. సుప్రీం కోర్టులో ఆ కేసు పెండింగ్లో ఉంది. కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చట్టపరంగా మూడు రాజధానుల విషయంలో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తించింది. ఎందుకంటే అమరావతి రాజధాని విషయంలో రైతులతో ఒప్పందం ప్రధాన అడ్డంకి కానుంది. అందుకే సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా.. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. కేవలం కోర్టులో ప్రతికూలత వస్తుందని భావించి అప్పట్లో ఆ నిర్ణయం తీసుకుంది. తాజాగా అమరావతికి చట్టబద్ధత అనే అంశం తెరపైకి వచ్చినప్పుడు.. విశ్లేషకుల ముసుగులో కొందరు వైసిపి అనుకూలురు కొత్త ప్రతిపాదన తెచ్చారు. పార్లమెంటులో చట్టబద్ధత కంటే రాష్ట్ర ప్రభుత్వ పరంగా సుప్రీంకోర్టులో ఉన్న కేసును వెనక్కి తీసుకోవచ్చు కదా అనేది వారి సూచన. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే పని చేసింది. అమరావతి ఏకైక రాజధాని అంటూ అఫిడవిట్ దాఖలు చేసింది. కానీ సుప్రీం కోర్టులో ఆ కేసు విచారణకు రాలేదు. ఒకవేళ వచ్చినా హైకోర్టు అమరావతికి అనుకూల తీర్పు ఇచ్చిన దృష్ట్యా దానికే కట్టుబడి ఉండాలని ఆదేశాలు ఇస్తుందని న్యాయ నిపుణులు సైతం చెబుతున్నారు. ఒకసారి సుప్రీంకోర్టు ఆ తీర్పు ఇచ్చిందంటే మరోసారి.. అమరావతి రాజధాని మార్పు అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉండదు. అయితే రాజకీయపరంగా చాలా రకాల వ్యాఖ్యలు చేయవచ్చు కానీ.. కొన్నింటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయలేం. ఇప్పుడు అమరావతి విషయంలో జగన్మోహన్ రెడ్డికి ఎదురైన పరిస్థితి అదే. అంతులేని మెజారిటీతో ఆయన గెలవాలి. ఆయనకు అనుకూలమైన కేంద్ర ప్రభుత్వం రావాలి. ఆపై సంకీర్ణ ప్రభుత్వంలో మిగతా రాజకీయ పార్టీలు సహకరించాలి. ఇంత జరిగిన తరువాత మాత్రమే రాజధానిని కదిలించగలరు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇంతకుముందే అంతులేని మెజారిటీతో గెలిచిన ఆయన అమరావతిని అంగుళం కదిపించలేకపోయారు. ఒకవేళ అధికారంలోకి వచ్చినా ఆయన అమరావతిని కొనసాగించాలి తప్ప వేరే ఆప్షన్ లేదన్న టాక్ కూడా ఉంది. సో ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలంతా కేవలం రాజకీయ గందరగోళం కోసమేనని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు.

# CSK ఫ్యాన్స్‌కి కిర్రాక్ న్యూస్.. ధోనీ, బ్రెవిస్ రీఎంట్రీకి డేట్ ఫిక్స్.. వచ్చేది ఆ రోజే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ఆరంభంలోనే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గడ్డు పరిస్థితులని ఎదుర్కొంటుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన జట్టు వరుసగా 3 మ్యాచ్‌ల్లో ఘోర ఓటమిని చవిచూసింది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్స్ తో జరిగిన హైవోల్టేజ్ పోరులో చెన్నై ఘోరంగా ఓడిపోయింది. మైదానంలో మహేంద్ర సింగ్ ధోనీ మార్గనిర్దేశం లేకపోవడం, వికెట్ల వెనుక అతడి చాకచక్యం లోపించడంతో జట్టు ప్రదర్శనపై తీవ్రంగా కనిపిస్తుంది. పిక్క కండరాల గాయంతో మొదటి రెండు వారాలు ధోనీ అందుబాటులో ఉండరని సీఎస్కే ఫ్రాంచైజీ ప్రకటించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అతడి రాకను త్వరలోనే ఫిక్స్ చేసే అవకాశం ఉంది.

**తలా రీఎంట్రీ:**

నిజానికి మహేంద్ర సింగ్ ధోనీ ఐదో మ్యాచ్‌లో కోల్‌కతాపై పునరాగమనం చేస్తారని అందరూ అనుకున్నారు. కానీ జట్టు వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉండటంతో, చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఏప్రిల్ 11వ తేదీన చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లోనే ఎంఎస్ ధోనీ బరిలోకి దిగే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తుంది. దీని కోసం ప్రత్యేకంగా ఫిట్‌నెస్ పరీక్షను నిర్వహించబోతున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ పరీక్షలో ధోనీ నెగ్గితే, సొంత మైదానంలో అభిమానుల కేరింతల మధ్య మహేంద్రుడు మెరుపులు మెరిపించడం ఖాయంగా మారనుంది.

**ఫినిషర్‌గా ధోనీ:**

వయసు మీద పడుతున్నప్పటికీ, ఎంఎస్ ధోనీ ఫినిషింగ్ సామర్థ్యం ఏమాత్రం తగ్గలేదు.. వికెట్ కీపింగ్‌లో మెరుపు వేగంతో స్పందించడమే కాకుండా, క్లిష్ట సమయాల్లో బౌలర్లకు సరైన సలహాలు ఇవ్వడంలో అతడు కీలక పాత్ర పోషిస్తాడు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ధోనీ అనుభవం చెన్నై జట్టుకు ఎంతో అవసరం అని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల ఖాతా తెరవాలని సీఎస్కే పట్టుదలతో ఉంది. ఈ కీలక పోరులో ధోనీతో పాటు మరో ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ సైతం తుది జట్టులోకి ఎంట్రీ ఇస్తాడని.. వీరిద్దరి రాకతో జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు.


# ఇకపై ఆ పప్పులు ఉడకవు.. చిన్నస్వామిలో సీన్ మారింది: బెంగళూర్ పిచ్ సీక్రెట్ బయటపెట్టిన పడిక్కల్



**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూర్‌లోని చినస్వామి స్టేడియం.. గ్రౌండ్ చిన్నగా ఉంటుంది.. ఈ స్టేడియంలో జరిగే మ్యాచుల్లో దాదాపు భారీ స్కోర్లే నమోదు అవుతుంటాయి. బ్యాటర్ల బౌండ్రీల సునామీతో అభిమానులకు కూడా కావాల్సినంత మజా దొరుకుతుంది. కానీ ఇకపై ఆ పప్పులు ఉడకవు.. వచ్చి రాగానే సిక్సులు కొడతామంటే కుదరదు.. చిన్నస్వామిలో సీన్ మారింది అంటున్నాడు ఆర్సీబీ బ్యాటర్, కర్నాటక లోయల్ బాయ్ దేవదత్ పడిక్కల్. ఆదివారం (ఏప్రిల్ 5) చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్ తలపడ్డ విషయం తెలిసిందే. ఈ మ్యాచులో అతిథ్య బెంగళూర్ 43 పరుగుల తేడాతో చెన్నైను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం ఆర్సీబీ బ్యాటర్ పడిక్కల్ మాట్లాడుతూ చిన్నస్వామి పిచ్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్నస్వామి పిచ్‌లో బ్యాటింగ్ తీరు మారిందని.. గతంలో మాదిరిగా తొలి బంతి నుంచే భారీ స్కోరు చేయడం ఇకపై సాధ్యం పేర్కొన్నాడు. తొలి ఓవర్లలో పిచ్ కొంచెం జిగటగా ఉంటుందని.. దీంతో మొదటి నుంచి దూకుడుగా ఆడటం ఇబ్బందికరమన్నాడు. తొలుత వికెట్లు కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని.. బంతి పాతబడే కొద్ది బ్యాటింగ్ ఈజీ అవుతుందని చెప్పాడు. 2025లో మా హోం గ్రౌండ్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయిన తర్వాత మేం ఈ విషయాన్ని గుర్తించామని తెలిపాడు. ఆ ఎదురుదెబ్బల నుంచి గుణపాఠం నేర్చుకుని.. తొలి 10 ఓవర్లలో అతిగా దూకుడుగా వెళ్లకుండా ఆడాలని నిర్ణయించుకున్నామని టీమ్ ప్లానింగ్ వివరించాడు.

చెన్నై, ఆర్సీబీ మ్యాచ్ అచ్చం పడిక్కల్ చెప్పిన మాదిరిగానే జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ పవర్ ప్లేలో అనుకున్నంతా దూకుడుగా ఆడకలేకపోయింది. విధ్వంసకర ప్లేయర్ సాల్ట్, కోహ్లీ వేగంగా రన్స్ చేయడంలో ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లేలో ఆర్సీబీ కేవలం 51 పరుగులు మాత్రమే చేయగలిగింది. కానీ ఆర్సీబీ 10 ఓవర్ల వరకు వికెట్లను కాపాడుకుంది. ఆ తర్వాత నుంచి గేర్ మార్చి ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. చివరి ఐదు ఓవర్లలోనే ఆర్సీబీ 97 పరుగులు చేసిందంటే ఆ జట్టు ఏ విధంగా విధ్వంసం సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. ఇక, కొండంత లక్ష్యం కండ్ల ముందు ఉండటంతో పిచ్ పరిస్థితి గురించి పట్టించుకోకుండా చెన్నై బ్యాటర్లు తొలి బంతి నుంచే బాదుడు మొదలు పెట్టారు. దీంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు నాలుగు కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురై చివరకు మ్యాచ్ ఓటమి పాలైంది.

# స్నాప్‌చాట్ పోస్ట్.. అమ్మాయితో అడ్డంగా దొరికేసిన అర్ష్‌దీప్ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా అతడి స్నాప్‌చాట్‌లో షేర్ చేసిన కొన్ని ఫోటోలు డేటింగ్ రూమర్లకు దారి తీశాయ. ఒక మిస్టరీ గర్ల్ చేయి పట్టుకుని ఉన్న ఫోటోను షేర్ చేయడంతో, ఆ అమ్మాయి ఎవరనే దానిపై అభిమానుల్లో ఇంట్రెస్ట్ మొదలైంది. ఇక ఆ అమ్మాయి పంజాబీ నటి సగ్రీన్ కౌర్ అని నెటిజన్లు భావిస్తున్నారు. ఫోటోలో కనిపిస్తున్న అమ్మాయి చేతిపై ఉన్న టాటూ, సగ్రీన్ కౌర్ టాటూతో సరిపోలడమే ఇందుకు ప్రధాన కారణం.. అంతేకాదు, ఇటీవల ముంబైలోని వాంఖడే స్టేడియంలో, న్యూ చండీగఢ్‌లో జరిగిన పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లకు ఆమె హాజరుకావడం ఈ అనుమానాలను మరింత బలపరిచింది.

సగ్రీన్ కౌర్ పంజాబీ చిత్ర పరిశ్రమలో పలు పంజాబీ మ్యూజిక్ వీడియోలు, సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా, కపిల్ దేవ్ నాయకత్వంలోని 1983 వరల్డ్ కప్ విజయం ఆధారంగా తెరకెక్కిన '83' సినిమాలో కూడా ఆమె ఒక పాత్రలో నటించారు.

**మైదానంలో అర్ష్‌దీప్:**

ఈసారి జరుగుతున్న ఐపీఎల్ లో అర్ష్‌దీప్ సింగ్‌కు అంతగా కలిసిరాలేదు. ఈ సీజన్‌లో అతడు ఇప్పటి వరకు ఒక్క వికెట్ కూడా తీయలేదు. లైన్ అండ్ లెంగ్త్ విషయంలో కాస్త ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ 27 ఏళ్ల ఈ లెఫ్ట్ హ్యాండ్ పేసర్ త్వరలోనే ఫామ్‌లోకి వచ్చి పంజాబ్ కింగ్స్ జట్టుకి తొలి టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాడని టీమ్ మేనేజ్‌మెంట్, అభిమానులు ఆశిస్తున్నారు. అటు వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణం, ఇటు మైదానంలో సవాళ్లతో అర్ష్‌దీప్ ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్నారు.

# యాంగ్రీ స్టార్ ఫ్యామిలీ స్టార్ లా బిజీ అవుతారా?

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో యాంగ్రీ స్టార్ రాజశేఖర్ ప్రస్తానం గురించి చెప్పాల్సిన పనిలేదు. దశాబ్దాల పాటు హీరోగా ఎన్నో చిత్రాలతో మెప్పించారు. తెలుగులో తనకంటూ ప్రత్యేకమైన అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఇలా కొంత కాలం పాటు ఆయన జమానా నడిచింది. హీరోగా అవకాశాలు తగ్గిన క్రమంలో? సొంత బ్యానర్లో కూడా చాలా సినిమాలు నిర్మించారు. వాటిలో కొన్ని విజయాలతో పాటు వైఫల్యాలున్నాయి. ప్రస్తుతం మాత్రం టాలీవుడ్ లో సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. నితిన్ హీరోగా నటించిన -ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్- తో సెకెండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టినా? ఆ సినిమా వైఫల్యంతో రీచ్ అవ్వలేదు.తాజాగా రిలీజ్ అయిన -బైకర్- విజయం సాధించడంతో రాజశేఖర్ రోల్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. దీంతో అధికారికంగా రాజశేఖర్ సెకెండ్ ఇన్నింగ్స్ షురూ అయింది. నటనలో ఆయన చూపిన పరిణతి, గంభీరమైన ఆహార్యం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.రాజ శేఖర్‌కు ఉన్న ప్రత్యేకమైన వాయిస్ బేస్ , స్క్రీన్ ప్రెజెన్స్ పెద్ద హీరోల సినిమాల్లో పవర్‌ఫుల్ పాత్రలకు సరిగ్గా సరిపోతాయి. ముఖ్యంగా మాస్ సినిమాల్లో తండ్రి పాత్రలు, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్స్ లేదా ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లో ఆయన కనిపిస్తే ఆ ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది.ఒకప్పుడు అగ్ర హీరోగా వెలిగిన నటులు ఇలాంటి మార్పును అంగీకరించడం అంత సులభం కాదు. కానీ రాజశేఖర్ వాస్తవాన్ని గ్రహించి నటుడిగా తన ప్రయాణాన్ని కొనసాగించడానికి సిద్ధపడటం శుభపరిణామం. ఇది కేవలం ఆయనకు మాత్రమే కాకుండా, టాలీవుడ్ పరిశ్రమకు కూడా ఒక మంచి సీనియర్ నటుడు అందుబాటులోకి వచ్చిన ట్లవుతుంది. వైవిధ్యమైన పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మరింత కలర్‌ఫుల్‌గా మార్చుకునే అవకాశం ఆయన చేతుల్లోనే ఉంది. టాలీవుడ్‌లో హీరోగా ఇమేజ్ తగ్గిన తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. -లెజెండ్- సినిమాతో విలన్‌గా మారి సౌత్ ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా బిజీ అయ్యారు.రాజశేఖర్ క్లిక్ అయితే జగపతి బాబుకు పోటీగానూ మారే అవకాశం ఉంది. జగపతి బాబు తరహాలోనే పరిశ్రమలో బలమైన వర్సటైల్ నటుడిగా స్థిరపడతారని విశ్లేషకులు భావిస్తున్నారు. మరి యాంగ్రీ స్టార్ నుండి వర్సటైల్ స్టార్ గా ఆయన ప్రయాణం ఎలా సాగుతుందో చూడాలి. రాజశేఖర్ కూడా ఇంత కాలం పెదవి దాటని మాటని ఈ మధ్యనే దాటించారు. మంచి పాత్రలు పోషించడానికి తానెప్పుడు ముందుటానని వెల్లడించిన నేపథ్యంలో కొత్త అవకాశాలు ఎంత మంది కల్పిస్తారో చూడాలి. ఇప్పటికే రెండు..మూడు ప్రాజెక్ట్ లు ఉన్నట్లు యాంగ్రీస్టార్ రివీల్ చేసిన సంగతి తెలిసిందే.





సొనాల్ చౌహాన్ సొగసైన బ్లాక్ గ్లామ్ లుక్‌లో స్టన్స్



సారా అర్జున్ యొక్క రాయల్ ఎత్నిక్ లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965